## నేటి ఆర్టీసి సమ్మెతో అధికారుల ప్రత్యామ్నాయ చర్యలు

**జహీరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** టిజిఎస్ ఆర్టీసి ఉద్యోగులు ఈ నెల 22 నుంచి సమ్మె బాట పడుతున్నందున ప్రయాణీకులు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు డిపో మేనేజర్ టి.స్వామి తెలిపారు. సమ్మెతో సమస్యలు ఉత్పనంకాకుండా జహీరాబాద్ డిపో పరిధిలో సేవలను యదావిధిగా సాగేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులైనవారిని తాత్కాలికంగా కండక్టర్లుగా నియమించనున్నట్లు, అసక్తిగల అభ్యర్థులు 10వ తరగతి లేదా సమానమైన పరీక్షలో ఉత్తీరణ సాధించినవారు, ఎత్తు 153 సెంటీమీటర్లు ఉన్నవారు, 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు వారు కండక్టర్ పోస్టుకు ధరఖాస్తులు చేసుకునేందుకు అర్హులన్నారు. డ్రైవర్ పోస్టు కొరకు ప్రాంతీయ భాష అయిన తెలుగు, చర్దూ చదవడం, రాయడం రావాలని, ఎత్తు 165 సెంటీమీటర్లు ఉండాలని, ఎంపిక తేదీ నాటికి ఒకటిన్నర సంవత్సరం పాటు హెచ్‌టివి/హెచ్‌పివి డ్రైవింగ్ లైసెన్స్ కల్గి ఉండాలని, 1 జులై 2026 నాటికి 25 సంవత్సరాల వయసు నిండి 35 ఏండ్ల లోపు ఉండాలని, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో అభ్యర్థులు తమ బయోడెటాను విద్యార్హత సర్టిఫికెట్లతో 22న ఉదయం 4 గంటలకు డిపో కార్యాలయ వద్ద సంప్రదించాలని డిఎం టి స్వామి సూచించారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## వడదెబ్బకు రైతు మృతి

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన రైతు కనసాని దేవేందర్‌రెడ్డి(57) వడదెబ్బకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, దేవేందర్‌రెడ్డి మంగళవారం ఉదయం వ్యవసాయ భూమికి పనుల నిమిత్తం వెళ్లాడు. అనంతరం మధ్యాహ్నం ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో అకస్మాత్తుగా కూలబడ్డాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, అప్పటికే ఆతడు మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. వడదెబ్బతో మృతి చెందిన రైతు కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇటీవల ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, నియోజకవర్గ స్పోర్ట్స్ చైర్మన్ వెన్న రాజులు మృతుని అంత్యక్రియలకు హాజరై నివాళి అర్పించారు.




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## ఎలెక్టోరల్ మ్యాపింగ్‌ను పారదర్శకంగా చేయాలి

### జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో ఎలెక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఈఆర్‌ఓలను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియపై ఈఆర్‌ఓలతో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నియోజకవర్గాల వారీగా దాదాపు సిద్దిపేట 53 వేలు, గజ్వేల్ 33 వేలు, దుబ్బాక 21 వేలు, హుస్నాబాద్ 18 వేలు ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియ పెండింగ్ ఉన్నందున వాటిని పూర్తి పారదర్శకంగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ కానీ ఓటరు వద్దకు వెళ్లి ఆయా మండలం వారిగా ఏఈఆర్‌ఓ వెరిఫై చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిఎల్‌ఓ, సూపర్ వైజర్, జీపీవో,ఏఈఆర్‌ఓలచే ఆయా నియోజకవర్గాల ఈఆర్‌ఓ డోర్ టు డోర్ వెరిఫై మ్యాపింగ్ జరిగేలా గతంలో వారి నివాసం ప్రస్తుతం ఎక్కుడున్నారో వెరిఫై చేసేలా సమావేశాలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఎస్‌హెచ్‌జీ మహిళలను సైతం ఓటరు వెరిఫై చేయడంలో భాగస్వామ్యం చేయాలన్నారు. అర్బన్ ప్రాంతాల్లో మ్యాపింగ్ ప్రక్రియ కోసం ఒక టీంను వేసి ఒక ప్రణాళిక ప్రకారం యాక్షన్ ప్లాన్ తయారు చేసి మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ వారు బిఎల్‌ఓల వారీగా పార్టీ ఏజెంట్లను నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూ భారతి పెండింగ్ అప్లికేషన్స్ డిస్పోజల్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్వో నాగరాజమ్మ, ఆర్డీఓలు సదానందం,రామ్మూర్తి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## పర్యావరణ సంరక్షణే లక్ష్యం

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ , ఏప్రిల్ 21, ప్రభాతవార్త :**




గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పక్షాన్ని పురస్కరించుకుని, 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికను మంగళవారం కలెక్టర్‌ఛాంబర్‌లో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ పాండుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. "భూమిని కాపాడుకుందాం", "ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం", "పచ్చదనం పెంచుదాం" వంటి నినాదాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించగలమని తెలిపారు. అలాగే, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెట్ల పెంపకం చేపట్టడం, నీటి వనరులను సంరక్షించడం వంటి చర్యలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.పాఠశాలలు, కళాశాలలు, యువత పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అందరూ కలిసికట్టుగా కృషి చేస్తేనే భూమి సంరక్షణ సాధ్యమవుతుందని, పర్యావరణ హిత చర్యలను నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, ఎన్‌జిసి జిల్లా సమన్వయ కర్త మాధవరెడ్డి, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన స్పెషల్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీలక్ష్మీ

**చిన్నకోడూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** చిన్నకోడూరు, చౌడారం గ్రామాల్లో నర్సరీ, మ్యాంగో హార్టికల్ ప్లాంటేషన్, హార్టికల్చర్ ప్లాంటేషన్, ఫార్మేషన్ రోడ్డు తదితర అభివృద్ధి పనులను మంగళవారం స్పెషల్ రూరల్ డెవలప్‌మెంట్ హైదారాబాద్ కమిషనర్ శ్రీలక్ష్మీ పరిశీలించారు. చౌడారంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గంతో కాసేపు మాట్లాడి అభివృద్ధి పనులపై చర్చించారు. ఉపాధి పనులు జరుగుతున్న స్థలానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఎన్‌ఎంఎస్ ఫొటో క్యాప్చర్ తదితర అంశాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు.అధికారులతో అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య, ఎంపిడివో జనార్థన్, ఎపివో శ్యాంసుందర్‌రెడ్డి, మండల ప్రజాపాలన అధికారి డి.విజయభాస్కర్, జిల్లా ఆర్టికల్చర్ అధికారులు, వాటర్‌షెడ్ మహేందర్‌రెడ్డి, నూరుద్దీన్, సర్పంచ్ వాసుదేవాచారి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ కదారి కనకయ్య, చౌడారం కనకయ్య,వార్డుసభ్యులు, టెక్నికల్‌అసిస్టెంట్లు,రైతులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న స్పెషల్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీలక్ష్మి, తదితరులు

# రైతులకు సాంప్రదాయ పంటలే లాభసాటి

### మెదక్ కలెక్టర్ ప్రతిమాసింగ్

**టేక్మాల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** రైతులకు సాంప్రదాయ పంటలే లాభసాటి అని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా టేక్మాల్ మండలం చంద్రు తండాలో కలెక్టర్ పర్యటించారు. కూరగాయల సాగును పరిశీలించి రైతులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు కష్టాన్ని నమ్ముకుని పని చేస్తారని రైతే దేశానికి వెన్నుముక అనే నినాదానికి నిదర్శనంగా చంద్రు తండా నిలుస్తుంది చెప్పారు. సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతూ లాభసాటి కూరగాయల పెంపకంతో కుటుంబాలు ఆర్థిక అభివృద్ధి చెందడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీ రూపంలో స్ప్రింక్లర్స్ అందించడం జరిగిందని, అదేవిధంగా వ్యవసాయ అధికారులు రైతులకు కూరగాయల సాగుకు సంబంధించిన మెలకువలు అందించడం ద్వారా ఆర్థిక చేయూత అందుతుందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పంటలను పండించే విధంగా అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సర్పంచి స్రవంతి సర్దార్, మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, ఏఈఓ వినోద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చంద్రుతండ రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

### సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి...

**టేక్మాల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** విద్యతో పాటు సామాజిక అంశాలపై విద్యార్థిని, విద్యార్థులు అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 20 నుంచి 26 వరకు సంక్షేమ వారోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో రెండవ రోజు టేక్మాల్‌లోని బీసీ హాస్టల్ లో ఎంపీడీవో, ఎంఈఓతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వసతి గృహంలోని స్టోర్ గది కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను సృజనాత్మకతలను వెలికి తీయడం మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలు వివిధ సబ్జెక్టులలో జ్ఞానాన్ని, ఆలోచనా విధానాన్ని పరీక్షించడానికి క్విజ్ పోటీలు, బాలల హక్కుల, ఆరోగ్యంపై అవగాహనపై నాటకాలు, సామాజిక న్యాయం, విద్య, పర్యావరణం ఆంగ్లంలో, తెలుగులో చర్చ ప్రసంగాలు సామాజిక న్యాయ, ప్రకృతి,సంస్కృతి అంశాలపై సృజనాత్మక వ్యక్తీకరణపై డ్రాయింగ్, పెయింటింగ్ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రియా జోద్దిన్, పంచాయతీ సెక్రెటరీ రాకేష్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



కంకోల్‌లో బోనాలు ఊరేగింపు తీసుకెళుతున్న మహిళలు

## కంకోల్‌లో రేణుకా ఎల్లమ్మ బోనాల ఊరేగింపు

**మునిపల్లి, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** మునిపల్లి మండలం కంకోల్ శివారులో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ గుడిలో గత ఆదివారం నుంచి విగ్రహ ప్రతిస్టాపన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆదివారం జాలాభిషేకం, ధాన్యభిషేకం, సోమవారం విగ్రహ ప్రతిస్టాపన, మంగళవారం గ్రామం నుంచి ఆలయం వరకు మహిళలు పెద్ద ఎత్తున బోనాల ఊరేగింపు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నప్రసాదన వితరణ చేశారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లి, బిడ్డ క్షేమం

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్‌లో 108 అంబులెన్స్‌లో సిబ్బంది గర్భిణికి సురక్షితంగా ప్రస వం నిర్వ హించి తల్లి, శిశువుల ప్రాణాలను కాపాడారు. మద్దూర్ మండలం రేబర్తి గ్రామానికి చెందిన నాగజ్యోతి(23), బీసీ కురుమకు సోమవారం రాత్రి ప్రసవ నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు.సమాచారం అందుకున్న వెంటనే మద్దూర్ 108 అంబులెన్స్ అక్కడికి చేరుకుని ఆమెను ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మద్దూర్ - ముస్తయాల మార్గమధ్యలో రాత్రి 8.24 గంటలకు అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగింది. ఈ సందర్భంగా 108 సిబ్బంది ఈఎమ్ ప్రేమ్‌కుమార్ సమయ స్ఫూర్తితో డెలివరీ నిర్వహించగా, పైలట్ ఇంథియాజ్ అంబులెన్స్‌ను వేగంగా ఆసుపత్రికి చేర్చారు. అనంతరం తల్లి, బిడ్డలను కమ్యూనిటీ హెల్త్ సెంటర్ చేర్యాలకు తరలించి వైద్యచికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం తల్లి, శిశువు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ



## 28 నుంచి బిజెపి శిక్షణా తరగతులు

### రాష్ట్ర నాయకుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త**

హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన బిజెపి శిక్షణ తరగతులను ముందుగా నిర్ణయించినట్లు మండలాల వారీగా కాకుండా, అన్ని మండలాలకు ఒకే వేదికగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏప్రిల్ 28, 29 తేదీలలో కొత్తకొండ వేదికగా హుస్నాబాద్, అక్కనపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, ఎల్కతుర్తి, బిందెవరపల్లి మండలాల బీజేపీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ నిర్ణయం హుస్నాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో తీసుకున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలను జాతీయ నాయకత్వం ఈ నెల 30లోపు పూర్తి చేయాలని ఆదేశించిన నేపథ్యంలో, సమయం తక్కువగా ఉండటంతో అన్ని మండలాల కార్యకర్తలకు ఒకచోట శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. శిక్షణ తరగతులకు బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బిఎల్ఎ- 2లు, పార్టీకి చెందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులు, మండల పార్టీ కమిటీ సభ్యులు, శక్తి కేంద్రాల ఇంచార్జిలు, అలాగే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పార్టీ, మోర్చాల కమిటీలలో పనిచేస్తున్న ప్రస్తుత, మాజీనాయకులు హాజరు కావాలని సూచించారు. పార్టీ మండలాల అధ్యక్షులు తమ మండలాల్లో ముఖ్య నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి, ఆహ్వానితులకు సమా చారం అందించాలని తెలిపారు.

ఏప్రిల్ 28న సాయంత్రం 4 గంటలకు కొత్తకొండ శిక్షణ ప్రాంగణానికి కార్యకర్తలు చేరుకోవాలని సూచించారు. ఏప్రిల్ 29 సాయంత్రం 5 గంటలకు శిక్షణ తరగతులు ముగిసే వరకు ప్రతి కార్యకర్త పూర్తిస్థాయిలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, శిక్షణ బాధ్యులు ఖమ్మం వెంకటేశం, వివిధ మండలాల బీజేపీ అధ్యక్షులు బుక్యా సంపత్ నాయక్, రామంచ మహేందర్ రెడ్డి, జాలిగం రమేష్, పోలోజు సంతోష్, దంచనాల శ్రీనివాస్, మంతుర్తి శ్రీకాంత్ యాదవ్, శ్రీరామోజు శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా శంకర జయంతి మహోత్సవం

**వర్గల్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):**

ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో మంగళవారం శంకర జయంతి మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సరస్వతీ పుత్రులు, వాస్తు సిద్ధాంతి, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు ఆదిశంకరుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధాంతి చంద్రశేఖరశర్మ మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షకులు ఆదిశంకరాచార్యుడి బోధనలు ప్రతి ఒక్కరిని ఆధ్యాత్మిక భావన వైపు నడిపించినట్లు స్పష్టం చేశారు.

నాస్తికత్వాన్ని రూపుమాపి సనాతన ధర్మం, వేద మార్గాన్ని ఆయన పునరుద్ధరించినట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా జ్ఞాన పీఠాల స్థాపనతో భిన్నమైన ఆరాధనలు ఒకే పరమాత్మను చేరనున్నట్లు ఆదిశంకరులు ప్రపంచానికి చాటిచెప్పినట్లు వివరించారు. శంకర జయంతి సందర్భంగా బ్రహ్మశ్రీ చంద్రశేఖరశర్మ సిద్ధాంతిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

# మహిళా సాధికారతకు అడ్డుపడుతున్న కాంగ్రెస్

### బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చీకోటి ప్రవీణ్

**మెదక్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** మహిళా సాధికారతకు అడుగడుగునా అడ్డుపడుతున్న కాంగ్రెస్ పార్టీ తీరుపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ విరుచుకుపడ్డారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో మహిళలకు 33 శాతం వాటా కల్పించాలనే సదుద్దేశంతో పార్లమెంటులో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెడితే, కాంగ్రెస్ పార్టీ తన వక్రబుద్ధితో వ్యతిరేకంగా ఓటు వేసిందని ఆరోపించారు. మహిళా వ్యతిరేక ధోరణిని ప్రదర్శించిన ఆ రోజును బీజేపీ ఖబ్లాక్ డేఖిగా పరిగణిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంటులో కేవలం సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ తప్ప వేరే మహిళలు ఉండకూడదన్నదే కాంగ్రెస్ నైజమని ఆయన ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని తెలిసినప్పటికీ, కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించడం దారుణమన్నారు. గత పదేళ్ల కేసీఆర్ మాటలతో మభ్యపెట్టి రాష్ట్రాన్ని దోచుకుంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అవినీతి ఏ స్థాయిలో ఉందంటే.. రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి నిధుల విడుదల కోసం 15 శాతం కమిషన్ ఇస్తే చాలు, 50 కోట్ల రూపాయల బిల్లులు క్షణాల్లో మంజూరవుతున్నాయని చికోటి ప్రవీణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రగతి భవన్ పేరును మార్చి కమిషన్ భవన్‌గా పెట్టాలని ఆయన ఎద్దేవా చేశారు. ఇక హైడ్రా అంశంపై స్పందిస్తూ, పేదల ఇళ్లను కూల్చివేస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. హైడ్రా నిజంగా పారదర్శకంగా ఉంటే, చెరువును 50 శాతం కబ్జా చేసి నిర్మించిన ఒవైసీకి చెందిన ఫాతిమా కాలేజీని ఎందుకు కూల్చలేదని ఆయన ప్రశ్నించారు. హైడ్రా అక్రమార్కుల పక్షాన కాకుండా పేదల పక్షాన ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే తీరు కొనసాగితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మోస పూరిత ముఖ్యమంత్రి అనే పేరు రావడం ఖాయమని హెచ్చరించారు. చివరగా, ఇటీవల కురిసిన వడగండ్ల వానల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని చికోటి ప్రవీణ్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న చీకోటి ప్రవీణ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## ప్రతి ఒక్కరూ హక్కుల కోసం పోరాడాలి

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ చైర్మన్ బక్కి వెంకయ్య, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**కంగ్టి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత, భాతరరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. జయంతి ఉత్సవాలకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకయ్య, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకయ్య, ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి అంబేద్కర్ గర్వకారణంగా నిలుస్తారన్నారు. ప్రతి ఒక్కరు విద్యావంతులై, సంఘటితంగా హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. రాజ్యాంగ పుణ్యంతోనే పేదు మనమందరం గౌరవ ప్రదమైన స్థానాల్లో ఉన్నామని గుర్తు చేశారు. ఎస్సీ,ఎస్టీల హక్కుల పరిరక్షణకు వారి సంక్షేమానికి కమిషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బక్కి వెంకయ్య హామి చేశారు. కార్యక్రమంలో డిఎస్పి వెంకట్‌రెడ్డి, సిఐ వెంకట్‌రెడ్డి,మండల ప్రజాప్రతినిధులు,ఆయా పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సెన్సస్ ట్రైనింగ్ క్లాసుల సమయాన్ని మార్చాలి

### టిఎస్‌యుటిఎఫ్

**నారాయణఖేడ్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతిని కలసి అధిక వేడిమి దృష్ట్యా సెన్సస్ ట్రైనింగ్ క్లాసులు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 వరకు నిర్వహించాలని, అదేవిధంగా ఏప్రిల్ 23వ తేదీన పాఠశాల చివరి పని దినం, పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఉన్నందున సెన్సస్ ట్రైనింగ్ క్లాసులను ఏప్రిల్ 23వ తేదీకి బదులు ఏప్రిల్ 24వ తేది నుంచి రెండో విడత ప్రారంభించాలని టిఎస్ యుటిఎఫ్ పక్షాన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె. అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు కాశీనాథ్ జాదవ్, జిల్లా కార్యదర్శి కె.హరిసింగ్ మరియు మండల నాయకత్వం శ్రీరామ్ నాయక్, దేవదానం, కాశీరాం, భూమయ్య గోవింద్, తుకారాం, నెహ్రూ, వసీం, వాజిద్ పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

## గుర్తు తెలియని మృతదేహం



గుర్తు తెలియని మృతుడు

**పాపన్నపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఏడుపాయల వన దుర్గ భవాని క్షేత్ర పరిసర ప్రాంతాల్లో ఓ యువకుడి మృతదేహం లభ్యం అయినట్లు పాపన్నపేట పోలీసులు తెలిపారు. మంగళవారం చెక్ డ్యాం కింద సాయంత్రం పశువుల కాపరులు గుర్తించి పాపన్నపేట పోలీసులకు సమాచారం అందివ్వడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నించగా ఎలాంటి ఆచూకీ లభ్యం కాక పోగ మృతుడి ఎడమ చేయి పై స్వరూప అనే పచ్చబొట్టు తో పాటు కుడి చేతిపై అమ్మ సన్ అనే పచ్చ బోట్లు కలిగి బ్లూ కలర్ టి షార్ట్,నల్లని ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు.ఎవరైనా మృతుడి ఫోటోలను గుర్తించిన సంబంధీకులు పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ ఫోన్ నంబర్ 8712657920, 87126557881 నంబర్లకు సంప్రదించాలని పోలీసులు కోరారు.

## కొడుకుతో కలిసి భర్తను హత్య చేసిన భార్య

**పాపన్నపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** కుటుంబ కలహాలతో భార్య కొడుకుతో కలిసి భర్తను హత్య చేసిన సంఘటన మండల పరిధిలోని పొడ్చన్ పల్లి తండాలో చోటుచేసుకుంది. ఏఎస్సై తుక్కయ్య కథనం ప్రకారం... పొడ్చన్‌పల్లి తండాకు చెందిన మాలోత్ కిషన్(60) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తరచూ మద్యం తాగి ఇంటికి వస్తున్నాడు. మద్యం మత్తులో తరచూ ఇంట్లో గొడవలు చోటుచేసుకుంటున్నాయి. సోమవారం రాత్రి సమయంలో కిషన్ మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉన్న భార్య మాలి, కొడుకు వినోద్‌తో గొడవ చోటుచేసుకుంది. కిషన్‌ను అంతమోదిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని భార్య మాలి, కొడుకు వినోద్ కిషన్‌ను కింద పడేసి చేతులతో బాగా కొట్టారు. మాలి కిషన్ కాళ్లు గట్టిగా పట్టుకోగా వినోద్ గొంతు నొక్కి హత్యచేసి ఇంటి ముందున్న నీటి తొట్టిలో పడేశారు. కొంత సేపటికి అటుగా వెళ్లిన స్థానికులు నీటి తొట్టిలో పడి ఉన్న కిషన్‌ను గమనించి బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. కిషన్ మృతి పట్ల అనుమానం రావడంతో మాలి, వినోద్‌లను నిలదీయగా హత్య చేసిన విషయం తెలిసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా హాస్పిటల్ కు తరలించారు. మృతుడి కూతురు లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తుక్కయ్య తెలిపారు.

## 20 కిలోల ఎండు గంజాయి పట్టివేత

**మునిపల్లి, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** మునిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద రూ.10లక్షల 34వేల 500 విలువ గల 20కిలోల 690 గ్రాముల ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఒడిస్సా రాష్ట్రం నుంచి కర్ణాటకకు ఎండు గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు సిఐ సుమన్‌కుమార్,ఎస్సై రాజేష్ నాయక్,సిసిఎస్ సిఐశివకుమార్,ఎస్సై శ్రీకాంత్‌లు రెండు బృందాలుగా ఏర్పడి వాహనాలను తనిఖీ చేస్తూ కంకోల్ వద్ద టిజి 28బి 4331 నెంబరు గల మారుతి బెలెనో కారును పట్టుకుని దానిలో 20 ప్యాకెట్లలోగల 20కెజిల గంజాయిని స్వాధీన పరుచుకున్నారు. గంజాయి తరలిస్తున్న భద్రాద్రికొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన మనోహర్‌రెడ్డి,రామవరంకు చెందిన సందీప్‌లను అరెస్టు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## సీనియర్ సిటిజెన్స్‌కు ఆసరా కార్డులు పంపిణీ



**అత్తాపూర్ ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాజేంద్ర నగర్ సర్కిల్ కార్యాలంలో డిపిఓ స్వాతి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజెన్స్ కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.అనంతరం 60 మంది సీనియర్ సిటిజెన్స్‌కు ఆసర కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్డులు అందుకున్న సీనియర్ సిటిజెన్స్ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ప్రతి ఒక్కరూ కూడా ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో డిపిఓ స్వాతి , సిఓ లక్ష్మణ్ , ఆర్పీలు మరియు సీనియర్ సిటిజెన్స్ పాల్గొన్నారు.

## బాలికల సంరక్షణ అందరి బాధ్యత



**అత్తాపూర్ ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** బాలికల సంరక్షణ అందరి బాధ్యత అన్ని జనహిత వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు ఉమామహేశ్వరి రెడ్డి పేర్కొన్నారు. కార్వాన్‌లోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి అతిథిగా ఉమామహేశ్వరి రెడ్డి హాజరై విద్యార్థుల భద్రతా చర్యల గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...బాలికలు వేధింపులు,లైంగిక దాడులు,ఇతర సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని ఎవ్వరైనా తమను ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే ఉపాధ్యాయులు కాని తల్లిదండ్రులకు చెప్పాలని సూచించారు.బాలికల వ్యక్తిగత భద్రతకు భంగం కలగకుండా చూడాలని ఆపత్కాల సమయంలో ఎదుర్కొనేందుకు విద్యార్థులకు ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలని వేధింపులకు తావులేకుండా చూడాలని సూచించారు.అనంతరం జనహిత వెల్ఫేర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు వస్తువులను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్లు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



**అత్తాపూర్ ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** బిఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను తీసివేస్తామని మాజీ సిఎం కెసిఆర్ ప్రకటించడంపై బిఆర్ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు.మంగళవారం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాలతో కాటేదాన్ డివిజన్‌లో కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు వెంకటేష్, మైలార్‌దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్ ఆధ్వర్యంలో మాజీ సిఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ....హైడ్రా అంటే పేదల ఇండ్లను కూల్చుడేనా? రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..వచ్చిన మొదటి రోజే హైడ్రాను ఎత్తి అవతల పడేస్తాం.. జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ వెల్లడించడం సంతోషంగా ఉందని రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ వెంకటేష్ గారు మరియు మైలర్ దేవ్ పల్లి పల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్ , రమేష్ ముదిరాజ్ , అక్కెం రాఘవేందర్ యాదవ్ , రాజేష్ యాదవ్ , సరిత మహేష్ , తిరుపతి రెడ్డి , యాదయ్య , కొంపల్లి జగదీష్ , వెంకటరమణ , మైసిరెడ్డి , ఆప్కో రాజు , బాలరాజు యాదవ్ , సునీల్ , రాజ్ కుమార్ , అశోక్ కుమార్ , ఈర్లపల్లి ప్రవీణ్ , అనిల్ , సింహాచలం , నరేష్ యాదవ్ , మల్లేష్ , సమ్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి , మహేందర్ , నరేష్ , చంద్రశేఖర్ రెడ్డి , ప్రవీణ్ మరియు తదితరులు పాల్గొన్నారు..

## చార్మినార్ సర్కిల్‌లో పర్యటించిన జోనల్ కమిషనర్



కుడా స్టేడియంలో జరుగుతున్న మరమ్మతుల పనులను పరిశీలిస్తున్న జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ ఎస్.శ్రీనివాస్ రెడ్డి

**చార్మినార్,ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డిమంగళవారం పలు విభాగాల అధికారులతో కలిసి చార్మినార్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆకస్మికంగా పర్యటించారు.చార్మినార్ సర్కిల్‌లోని మొఘల్‌పుర స్విమ్మింగ్ పూల్ పునరుద్ధరణ పనులు,కుడా స్టేడియంలో జరుగుతున్న మరమ్మతుల పనులు,సెంట్రల్ మీడియన్ యూబీ డి పనులు,సిటీ కళాశాల వద్ద చేపడుతున్న ఆధునికసెంట్రల్ లైటింగ్ పనుల గురించి సంబంధిత అధికారుల నుంచి ఆయన ఆరా తీశారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ పనులలో నాణ్యత పాటిస్తూ గడువు లోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్ డిఎంసి సరిత,జోనల్ ఎస్ఈ ఇందిరాదేవి,యూబిడి డిప్యూటీ డైరెక్టర్ దేవజా,మేనేజర్ రమేష్,ఈఈ సన్నావుద్దీన్,డిఈ శానిటేషన్ శ్రీ రాములు,ఎలక్ట్రికల్ డిఈ సత్యనారాయణ రెడ్డి,గేమ్స్ ఇన్‌స్పెక్టర్ రవూఫ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పారిశుధ్యం విభాగం అధికారుల అవినీతి లీలలు

**-।అధ్వానపు పారిశుధ్యంతో ప్రజలు అవస్థలు**

**కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి జోన్ పరిధిలోని కూకట్‌పల్లి, ఆల్విన్ కాలనీ, మూసాపేట్ సర్కిళ్లలో పారిశుధ్య విభాగం పనితీరుపై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారులు పర్యవేక్షణను పక్కనపెట్టి, నెలవారీ మామూళ్లకే పరిమితమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం కారణంగా పలు ప్రాంతాల్లో చెత్తాచెదారాలు పేరుకుపోతుండగా, కాలనీలు, బస్తీలు అధ్వాన్న పరిస్థితులకు చేరుకున్నాయి. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకు పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కొంతమంది అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతూ సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారుల అండతో కొన్ని ప్రాంతాల్లో బోగస్ పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన గల్ఫ్ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం



గల్ఫ్‌లో చనిపోయిన మృతుని భార్యకు ఆర్థిక సహాయం చెక్కును అందిస్తున్న డా.జి.చిన్నారెడ్డి.

**బేగంపేట ఏప్రిల్ 21,ప్రభాతవార్త** దుబాయ్ లో అనారోగ్యంతో కోమాలో ఉన్న జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామినికి చెందిన ఆరెల్లి గంగారాజం అనే గల్ఫ్ కార్మికునికి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ కు తరలించి చికిత్స అందిస్తుండగా 10రోజుల తర్వాత అతను మృతి చెందాడు.ఈ మృతిని స్పెషల్ కేసుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిగణించి మృతుని కుటుంబానికి 5లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.చెక్కును సీఎం ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మృతుడు భార్య ఆరెల్లి రాజవ్వకు చెక్కును అందజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ ,అంబాసిడర్ డా.బి.ఎం.వినోద్‌కుమార్,వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి,మెంబర్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డి,ప్రవాసీ ప్రజావాణీ కో ఆర్డినేటర్ బొజ్జా అమరేందర్ రెడ్డి లు పాల్గొన్నారు.ఆరెల్లి గంగారాజం(61) కిడ్నీ సంబంధిత వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురై 2025నవంబరు 12న దుబాయ్‌లోని ఆస్టర్ హాస్పిటల్‌లో కోమాలోకి వెళ్లారు.మెరుగైన చికిత్స కోసం డిసెంబరు 14న హైదరాబాద్ తరలించి నిమ్స్ లో చేర్చారు.అనంతరం జగిత్యాల రిహాబిలిటేషన్ సెంటర్ లో చికిత్స పొంది చివరకు జగిత్యాల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డిసెంబరు 24న మరణించారు.జీఓ నెం 216ప్రకారం గల్ఫ్ దేశాల్లో మరణించిన వలస కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ5లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తుంది.అయితే ఈ కేసులో మరణం భారత్‌లో చోటు చేసుకోవడంతో మరణ స్థలం గల్ఫ్ దేశం అయిఉండాలి అనే సాంకేతిక నిబంధన కారణంగా ఆర్థిక సహాయం పొందడంలో ఆటంకం ఏర్పడింది.స్పెషల్ కేసుగా గుర్తించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి ఆ కుటుంబాన్ని 5లక్షలు అందజేసి ఆదుకున్నారు.మార్చి 31న ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణీలో మృతుని కుమారుడు జలంధర్, రాజవ్వలు దరఖాస్తు సమర్పించగా సీఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరు చేసారు.ఈ సందర్భంగా గల్ఫ్ కార్మిక కుటుంబాలను మానవతా దృక్పథంతో ఆదుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,జగిత్యాల ఎమ్మెల్యే డా.మాకునూరి సంజయ్ కుమార్,అధికార యంత్రాంగానికి పొలాస సర్పంచ్ మిల్కూరి శంకరయ్య,డీసీసీ అధ్యక్షులు గాజెంగి నందయ్య,మృతుని కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేసారు.

## ఆరోగ్యవంతమైన సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యం : అరవింద్ కుమార్ యాదవ్



పోషణ్ పక్వాడా కార్యక్రమం లో పాల్గొన్న తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్ కుమార్ యాదవ్

**చిక్కడపల్లి ఏప్రిల్ 21 (ప్రభాతవార్త ) :** ఆరోగ్యవంతమైన సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్ కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్ లో స్థానిక గిరినగర్ కమ్యూనిటీ హాల్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, లక్ష్మీ గణపతి దేవాలయ ఛైర్మన్ మారిశెట్టి నర్సింగ్ రావు ఆధ్వర్యంలో గర్భిణీలకు, బాలింతలకు పోషక విలువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఖిపోషణ్ పక్వాడాఖి కార్యక్రమం జరిగింది. అరవింద్ కుమార్ యాదవ్ మా ట్లాడుతూ పోషకాహార లోపం లేని సమాజాన్ని నిర్మించ డం మనందరి బాధ్యత అని, చిన్నారుల భవిష్యత్తుకు పౌష్టికాహారమే పునాది అని, గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్లనే ఆరోగ్యవంతులైన చిన్నారులు జన్మిస్తారన్నారు. దేశ భవిష్యత్తు నేటి బాలల పైనే ఆధారపడి ఉంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం పౌష్టికాహారం విషయంలో ప్రత్యే క శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఆ దిశలో అంగన్‌వాడీ టీచర్లు క్షేత్రస్థాయిలో చేస్తున్న సేవలు అభినందనీయమ న్నారు. అనంతరం పౌష్టికాహారంతో కూడిన కిట్లను లబ్ధి దారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, నేతలు సాయికీర్త్ ( బాబ్జి), నరేందర్, దేవీ, వరప్రసాద్, సాయిరాం, సురేందర్, వందిత్, భాస్కర్ మరియు పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్‌లు తక్షణమే అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వి.సంధ్య

**సైఫాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** మహిళా రిజర్వేషన్‌లను నియోజకవర్గాల పునర్విభజన లెక్కింపుతో ముడిపెట్టకుండా తక్షణమే అమలు చేయాలని పిఓడబ్ల్యూ, పిఎంఎస్, ఐజెఎం డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ జి.ఝాన్సీ , జాతీయ నాయకురాలు వి.సంధ్య, రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ, ప్రధాన కార్యదర్శి మంగ మాట్లాడుతూ మహిళలు దశాబ్దాలు తరబడి మహిళా రిజర్వేషన్‌ల కోసం పోరాడుతున్నారని, మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి మూడు దశాబ్దాలు గడిచిందని, బిల్లు కోసం అనేక ఉద్యమాలు కొనసాగాయని, అయితే మరోసారి పార్లమెంట్‌లో బిజెపి బిల్లు పెట్టి విగిపోయేలా చేసిందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ హామీ ఇస్తూ అధికారంలోకి వచ్చిన బిజెపి తిరిగి అధికారం పోందడానికి 2023లో నారీశక్తి వందన్ అధినేయం పేరుతో చట్టం తెచ్చిందని, దీన్ని అమలు చేయకుండా జనాభా లెక్కలతో ముడిపెట్టి 2029లో అమలు చేస్తామని ప్రకటించిందన్నారు. తిరిగి ఇప్పుడు అమలు చేయడానికి నియోజకవర్గాల పునర్విభజన పేరుతో ముడిపెడుతూ పార్లమెంట్‌లో బిల్లు పెట్టిందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కాకుండా బిజెపి చేస్తున్న కుటిల ప్రయత్నాలను వారు తీవ్రంగా ఖండించారు. మహిళా సాధికారతకు చిత్తశుద్ధితో పారదర్శక కార్యాచరణ తక్షణమే చేపట్టాలిని వారు డిమాండ్ చేశారు.

## దేవరకొండ బస్తీలో ప్రారంభమైన నాలా పనులు

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః** బంజారాహిల్స్‌లోని దేవరకొండ బస్తీలో నాలా పనులు ప్రారంభమయ్యాయి. నాలా పనులు ప్రారంభించిన గుత్తేదారు కాలువలను తీసి పనులు నిలిపివేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాలాలపై కర్రలు వేసుకొని దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలా మంది బస్తీవాసులు ఇళ్ల ముందు కాలువ తవ్వడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాజాగా ఈ దైన్య పరిస్థితిపై 'దారి ఇలా.. దాటెదెలా..!' అంటూ ప్రభాతవార్తలో వార్త సైతం ప్రచురతమైంది. దేవరకొండ బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. పనులను ప్రారంభించాలని సూచించారు. దీంతో అధికారులు పనులను తిరిగి ప్రారంభించారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు వెంకటేశ్వర కాలనీ డివిజన్ అధ్యక్షుడు రాములుచౌహాన్, అక్బర్, మసూద్, రషీద్, మహమూద్, ఆంటోనిలతోపాటు జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగ ఏఈ మోహన్‌రావుతో కలిసి పనులను పరిశీలించారు. పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని రాములు చౌహాన్ తెలిపారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం - ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు



బాల్య వివాహాల నిర్మూలనా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావు, నిర్వాహకులు

**చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** బాల్య వివాహాలు చట్టరీత్య నేరమని, వాటిని ప్రోత్సహిస్తే మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుందని ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ బి.కోటేశ్వరరావు స్పష్టం చేశారు. ఆశ్రిత సంస్థ ఆధ్వర్యంలో అలియాబాద్ శారదా హై స్కూల్లో అక్షయ తృతీయ బాల్య వివాహ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు, ఉపాధ్యాయులతో కలిసి బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం సీఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలికలకు, 21 ఏళ్ల లోపు బాలురకు వివాహం చేయరాదన్నారు. చట్ట ప్రకారం బాల్య వివాహం జరిపించినా, ప్రోత్సహించినా జైలుశిక్ష, జరిమాన విధిస్తారని వివరించారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. బాల్య వివాహాల వల్ల చదువు, ఆరోగ్యం నష్టపోతారన్నారు. అనంతరం విద్యార్థులచే బాల్య వివాహ నిర్మూలనా ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయులు పద్మ, ఆశ్రిత సంస్థ ప్రతినిధులు మమత, వీరబాబు, మాధవి పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్ కార్డులు అందజేత



సీనియర్ సిటిజన్ కార్డులు అందజేస్తున్న డీసీ జ్యోతి

**సికింద్రాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** వృద్ధులకు అవసరమైన సేవలను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా తార్నాక సర్కిల్ పరిధిలోని బౌద్ధనగర్లో సీనియర్ సిటిజన్ కార్డుల జారీ కోసం ప్రత్యేక శిబిరం నిర్వహించామని జీహెచ్ఎంసీ తార్నాక సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎంఎన్ఆర్. జ్యోతి తెలిపారు. బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో వృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిబిరానికి వృద్ధుల నుండి మంచి స్పందన లభించిందని తెలిపారు. సీనియర్ సిటిజన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుని, సులభంగా పొందేందుకు వారు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారని వివరించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా ప్రక్రియ కొనసాగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూనిటీ ఆర్గనైజర్ వరుణ తదితరులు పాల్గొన్నారు.

## శృంగేరి శంకర మఠంలో శంకర జయంతి వేడుకలు



నల్లకుంటలోని శృంగేరి శంకర మఠంలో శంకర జయంతి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి ఏప్రిల్ 21 (ప్రభాతవార్త ) :** నల్లకుంటలోని శ్రీ శృంగేరి శంకర మఠంలో శ్రీ శంకర జయంతి వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా హర్యానా గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ మఠాన్ని సందర్శించి, ఆది శంకరాచార్యుల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సనాతన ధర్మానికి ఆది శంకరాచార్యుల బోధనలు దిక్సూచిగా నిలిచాయని కొనియాడారు. సమాజంలో శాంతి, ఐక్యత వెల్లివిరియాలన్నా, ఆధ్యాత్మిక విలువలు పెంపొందాలన్నా శంకర భగవత్పాదుల సందేశాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాశం సాయికృష్ణ యాదవ్, కౌండిన్య ప్రసాద్‌తో పాటు మఠం నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర : వేముల రామకృష్ణ



యూనివర్సిటీల విద్యార్థి సంఘాల ప్రతినిధుల సమావేశంలో విద్యార్థి జేఏసి ఛైర్మన్ వేముల రామకృష్ణ తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త** ఫీజు రియంబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్రను మానుకోవాలని తెలంగాణ విద్యార్థి జేఏసి ఛైర్మన్ వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు.మంగళవారం అఖిలపక్ష యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజులు కట్టలేక విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో ఫీజుల పోరుకు అన్ని యూనివర్సిటీల విద్యార్థి సంఘాలు ఐక్యం ఉద్యమానికి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. 'కళాశాలలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తాం అంటున్నారు, ఫీజులు కట్టలేక ఉన్నత చదువులు, ఉద్యోగాలు వదులుకుంటున్నారు. కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.బీటెక్ చదువుతున్న ప్రణీత్ అనే విద్యార్థి, కాలేజీ యాజమాన్యం ఫీజుల కోసం ఒత్తిడి చేయడంతో అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకోవడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం భారత అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. దగ్గర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఛైర్మన్లు భారీ జీతాలకు, అలవెన్సులకు,హెలికాప్టర్ ప్రయాణాలకు, సంబరాలకు, మూసి సుందరీకరణలకు మాత్రం నిధులు వెచ్చిస్తున్న ప్రభుత్వం పేద విద్యార్థులు చదువుకుంటామంటే ఫీజులకు డబ్బులు లేవంటున్నారని ఆయన ధ్వజమెత్తారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉమేష్ (వెటర్నర్ యూనివర్సిటీ), వంశీ (అగ్రికల్చర్ యూనివర్సిటీ), సంజయ్ (ఉస్మానియా యూనివర్సిటీ), పాపారావు(తెలంగాణ యూనివర్సిటీ), మహేందర్ (కాకతీయ యూనివర్సిటీ), అజయ్ (నిజాం కాలేజీ), రాకేష్ (సెంట్రల్ యూనివర్సిటీ) తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య అభ్యున్నతికి నూతన కమిటీ కృషి : ఉప్పు మనోహర్



సికింద్రాబాద్ ఆర్యవైశ్య క్లబ్ నూతన కార్యవర్గం.

**బేగంపేట ఏప్రిల్ 21,ప్రభాతవార్త** అర్యవైశ్యులు అభ్యున్నతికి నూతన కమిటీ శాయిశక్తులా కృషి చేస్తుందని సికింద్రాబాద్ ఆర్యవైశ్య క్లబ్ నూతన అధ్యక్షుడు ఉప్పుమనోహర్ అన్నారు.సికింద్రాబాద్ ఆర్యవైశ్య క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో సభ్యులు ఆనందోత్సహాలతో గడిపారు.హిందూత్వం మనో గుండెల్లో.సేవ మన చేతుల్లో అనే నినాదంతో ఆర్యవైశ్య క్లబ్ సికింద్రాబాద్ నిర్వహించిన క్లబ్ ప్రమాణ స్వీకరోత్సవం కన్నుల పండువగా సాగింది. 2026.2027వ సంవత్సరానికి గాను ఆర్యవైశ్య క్లబ్ సికింద్రాబాద్ అధ్యక్షునిగా ఉప్పు మనోహర్,కార్యదర్శిగా పురం రమేష్,కోశాధికారిగా కొడిత్యాల రంజిత్‌కుమార్‌లు ప్రమాణ స్వీకారం చేసారు.ఈ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ సంస్కార శిక్షణ ప్రాంత ప్రముఖ్ విమలానంద బోడ్డు మల్లికార్జున్ ముఖ్య అతిధిగా ,పుల్లూరి శ్రీకాంత్ గౌరవ అతిధిగా పూర్ణచందర్,అల్లాడి హరీష్‌కుమార్‌లు ప్రత్యేక అతిధులుగా సాలూరి సురేష్ ప్రాజెక్టు సలహాదారుగా,మహంకాళీ ఉమామహేశ్వర్ ప్రాజెక్టు ఛైర్మన్ హాజరయ్యారు.మంచికంటి రాధిక, ఉప్పుశ్రీఐశ్వర్యలు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.క్లబ్ పూర్వాధ్యక్షులు,కార్యవర్గసభ్యులు హాజరయ్యారు.ఎన్నో సంవత్సరాలుగా సామాజిక ,సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆర్యవైశ్య క్లబ్ సికింద్రాబాద్ మరింత పురోగతి సాధించాలని మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వక్తలు ఆశాభావం వ్యక్తం చేసారు.ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా పేదలకు కుట్టు మిషన్,నిత్యావసర సరుకులను పంపిణీ చేసారు. అనాధాశ్రమానికి వృద్ధాశ్రమానికి చేయూతను అందించారు.

### ఠాణా మెట్లెక్కిన ఖరీదైన కార్పెట్ వివాదం

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్‌లో ఒక ఖరీదైన కార్పెట్ వివాదం పోలీసు ఠాణాకు చేరింది. ఖరీదైన కార్పెట్‌ను తిరిగి ఇవ్వకుండా కంపెనీని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడన్న ఆరోపణలతో ఒక ఉద్యోగిపై ఈ కేసును నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లోని ఓబీటీ కార్పెట్స్‌లో పనిచేసే గుండా చంద్రశేఖర్ రెడ్డి జనవరి 30న భద్రత కారణంగా రూ.4,30,000 విలువైన కార్పెట్‌ను తన ఇంటికి తీసుకెళ్లాడు. అయితే, ఇటీవల అతని పనితీరు సరిగా లేకపోవడంతో సంస్థ అతడిని ఉద్యోగానికి రాజీనామా చేయమని కోరింది. దీంతో ఆగ్రహానికి గురైన చంద్రశేఖర్ రెడ్డి కార్పెట్‌ను తిరిగి ఇవ్వకుండా కంపెనీని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. ఒక కస్టమర్‌కు ఈ కార్పెట్‌ను తక్షణం అందించాల్సిన అవసరం ఉందని, అందువల్ల అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్టోర్ మేనేజర్‌గా పని చేస్తున్న సుకన్య ఆకర్ష్ జూబ్లీహిల్స్ పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పెళ్లి పేరుతో మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః** పెళ్లి పేరుతో దగ్గరై, రెండు సార్లు గర్భస్రావం చేయించి ఇప్పుడు ముఖం చాటేసిన ఒకరిపై బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. కొల్లూరుకు చెందిన సయ్యద్ సమితో బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన ఒక యువతికి 2023లో పరిచయమైంది. ఇది కాస్త ప్రేమగా మారి పెళ్లి చేసుకుంటానని నమ్మించే వరకు వెళ్లింది. దీంతో ఇద్దరు ఒకరికొకరు దగ్గరయ్యారు. ఈ క్రమంలోనే ఆమె గర్భిణీ కాగా ప్రతిసారి నిందితుడు ఆమెకు మాత్రలు ఇచ్చి గర్భస్రావం అయ్యేలా చేశాడు. ఇటీవల పెళ్లికి ముఖం చాటేయడంతో పెద్దల సమక్షంలోనే చర్చలు జరిగాయి. అయినా పెళ్లికి అంగీకరించకపోవడంతో పెళ్లి పేరుతో తనను మోసగించాడంటూ సమిపై ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వృద్ధ తండ్రిపై కుమారుడి దాష్టీకం

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః** ఒక వృద్ధ తండ్రిపై కుమారుడు దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన బోరబండ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. బోరబండ సైట్-3 సునీల్‌నగర్‌లో నివసించే రంగారెడ్డి(70) చిన్న కుమారుడు అనీల్‌కుమార్(43) సెంట్రింగ్ వర్క్ చేస్తుంటాడు. ప్రతి రోజు మద్యం సేవించి ఇంటికి వచ్చే అనీల్‌కుమార్ ఈ నెల 20న మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. వచ్చి రాగానే తండ్రితో గొడవకు దిగి అతన్ని దూషిస్తూ అతని చేతికి ఉన్న రింగ్ సాయంతో దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయలయ్యాయి. దీంతో బాధితుడు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సిటిజన్ సెంట్రిక్ సెక్షన్ 118(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ముషీరాబాద్‌లో హైబ్రిడ్ గంజాయి స్వాధీనం



ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీఎత్తున హైబ్రిడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

**చిక్కడపల్లి ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త ) :** ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా హైబ్రిడ్ గంజాయి (ఓ జి కుష్ ) పట్టుబడింది. పక్కా సమాచారం మేరకు స్థానిక ఇన్స్పెక్టర్ డి.రామకృష్ణ నేతృ త్వంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 1.311 కేజీల మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ముషీరాబాద్ ఎస్‌హెచ్ఓ సిబ్బందితో కలిసి నామాలగుండు ప్రాంతంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద తనిఖీలు చేపట్టారు. అక్కడ బర్గ్‌మన్ వాహనంపై ఉన్న రోషన్ సింగ్ (29) అనే వ్యక్తిని ఆపి సోదా చేయగా, అతని కాలేజీ బ్యాగులో అత్యంత ఖరీదైన ఖిఓజీ కుష్ఖి (హైబ్రిడ్ గంజాయి) లభించింది. పద్మారావు నగర్‌కు చెందిన రోషన్ సింగ్‌పై గతంలో కార్ఖానా పోలీస్ స్టేషన్‌లో కూడా కేసు నమోదై ఉంది. కాగా ఈ కేసులో ఏ2 నిందితుడిగా యాపియల్‌కు చెందిన ఇంజోత్ సింగ్ (27)ను పోలీసులు గుర్తించారు. ఇంజోత్ సింగ్‌పై గత నెల 16న కుతుబుల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద లభించిన 1.311 కేజీల డ్రగ్స్ విలువ మార్కెట్లో సుమారు రూ. 26 లక్షల నుండి రూ. 39 లక్షల వరకు ఉంటుందని అంచనా. ప్రస్తుతం ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నగరంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాల మూలాలను వెలికితీసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.

### ఇ-పెట్టి కేసులో వ్యక్తికి రెండు రోజుల జైల్ శిక్ష

**గోషామహల్,ఏప్రిల్ 21ప్రభాతవార్త:** అసభ్యప్రవర్తన,దాడి ఆరోపణలతో కూడిన ఓ వ్యక్తికి న్యాయస్థానం రెండు రోజుల జైల్ శిక్ష విధించింది.ఈ సంఘటన గోషామహల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోచోటు చేసుకుంది.ఇన్‌స్పెక్టర్ శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. బేగంబజార్ కోల్సా వాడి ప్రాంతానికి చెందిన ఎ.గురునాథ్(55) ఆకారణంగా ఓమహిళాను దూషించి, అసభ్యకరమైన భాషనుఉపయోగించడంతో గోషామహల్ పోలీసులు అతనిపై ఈ-పిటి,సెక్షన్70(బి),70(సి),సిపి యాక్టు115(2) కింద కేసు నమోదు చేసి స్పెషల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగాగురునాథ్‌కు రెండు రోజుల జైల్ శిక్ష విధించారు.ఈ కేసును గోషామహల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### గుర్రం చెరువులో చిక్కుకున్న వృద్ధుడిని రక్షించిన పోలీసులు

**చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** చాంద్రాయణగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలోని గుర్రం చెరువులో చిక్కుకున్న ఒక వృద్ధుడిని పోలీసులు క్షేమంగా బయటకు తీశారు. అనంతరం వైద్య పరీక్షలు జరిపించి ఆహారాన్ని అందజేశారు. వివరాలలోకి వెళితే మచ్చబొల్లారం నివాసి ఎల్లప్ప కుమారుడు హనుమంతు (60) మంగళవారం మధ్యాహ్నం బాలాపూర్ రోడ్డులోని గుర్రం చెరువులోకి దిగి అందులో చిక్కుకు పోయాడు. బయటకు రాలేక గుర్రపు డెక్క, బురద నీటి మధ్య ఇరుక్కున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి స్టేషన్, లేక్ పోలీసు సిబ్బందితో కలిసి చెరువులో చిక్కుకున్న వృద్ధుడిని దృఢమైన ప్లాస్టిక్ తాడుతో చాకచక్యంగా బయటకు లాగారు. ఎండదెబ్బకు అలసి సొలసి ఉన్న హనుమంతుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తక్షణ శక్తినిచ్చే పానీయాలను, ఆహార పదార్థాలను అందజేశారు. చెరువులో చిక్కుకున్న వృద్ధుడిని రక్షించిన ఇన్‌స్పెక్టర్ గోపి బృందాన్ని స్థానికులు అభినందించారు. కానిస్టేబుళ్లు జగదీష్, నాగులు, ప్రవీణ్, జబ్బార్ తదితరులు ఈ సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

### బైరుని చెరువులో గుర్తుతెలియని మృతదేహం

**కొంపల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త** బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బైరుని చెరువులో ఒక గుర్తుతెలియని పురుషుడి మృతదేహం తేలుతూ కనిపించడం కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం సుమారు 09:39 గంటలకు చెరువులో మృతదేహం తేలుతున్నట్లు పెట్రోలింగ్ మొబైల్‌కు సమాచారం అందింది. వెంటనే పోలీసులు, మున్సిపల్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీశారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్యగా ఉండవచ్చుని, గోధుమ వర్ణం కలిగిన వ్యక్తిగా గుర్తించారు. అయితే మృతదేహం వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు లభించకపోవడంతో, స్థానికులు కూడా ఆయనను గుర్తించలేకపోయారు.ఈ ఘటనపై బచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కి తరలించారు.

### ఆస్థి వ్యవహారంలో వృద్ధుడిపై దాడి

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః** ఆస్థి వ్యవహారంలో ఒక వృద్ధుడిపై దాడి చేసిన ఇద్దరిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడ శ్రీకృష్ణ నగర్‌లో మహమ్మద్ యూనుస్ అలీ(75) తన నివాసంలోని రెండో, మూడో అంతస్తులను నెలకు రూ. 8వేల అద్దెకు మొహమ్మద్ ఫైయాజ్ అలీ, అతని భార్య ఫర్హత్ ఫాతిమాకు ఇచ్చారు. వృద్ధాప్యం, సంతానం లేకపోవడాన్ని ఆసరాగా తీసుకున్న వారిద్దరు 2019లో మోసపూరితంగా తప్పుడు సమాచారం ఇచ్చి, ఫైయాజ్ అలీని అతని కుమారుడిగా చూపిస్తూ పార్టిషన్ డీడ్ నమోదు చేయించుకున్నారు. ఈ విషయాన్ని 2024లో గుర్తించిన బాధితుడు, ఆ డీడ్‌ను రద్దు చేయాలని సివిల్ కోర్టులో కేసు వేశారు. దీనిపై కక్ష పెంచుకున్న నిందితులు ఏప్రిల్ 13న మధ్యాహ్నం సమయంలో ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి, వృద్ధుడిని దూషిస్తూ దాడి చేశారు. ఈ ఘటన తర్వాత కూడా నిందితుల నుంచి తన ప్రాణాలకు ముప్పు ఉందని బాధితుడు ఆందోళన వ్యక్తం చేస్తూ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 316(2), 351(2)(3), 352, 351తో పాటు బీఎన్ఎస్ఎస్ 175(3) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నకిలీ నంబర్ ప్లేట్‌తో తిరుగుతున్న యువకుడు అరెస్ట్

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 21, ప్రభాతవార్తః** నకిలీ నంబర్ ప్లేట్‌తో వాహనంపై సంచరిస్తున్న ఒక యువకుడిని జూబ్లీహిల్స్ ట్రాఫిక్, శాంతి భద్రతల విభాగా పోలీసులు సంయుక్త ఆపరేషన్‌లో పట్టుకున్నారు. ట్రాఫిక్ నిబంధనల నుంచి తప్పించుకోవడానికి, అధికారులను తప్పుదోవ పట్టించడానికి నిందితుడు ఈ అక్రమానికి పాల్పడినట్లు గుర్తించారు. సంయుక్త కమిషనర్(ట్రాఫిక్) జోయల్ డేవిస్ తెలిపిన వివరాల ప్రకారం.. స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న వి. సురేష్ కుమార్ (26) తన హోండా యాక్టివా వాహనానికి అసలు నంబర్ టీఎస్09బిడబ్ల్యూటీఆర్7624 కు బదులుగా ఏపీ 39కేజీ 7219 అనే నకిలీ నంబర్ ప్లేట్‌తో సంచరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లో తనిఖీ లు చేపట్టిన పోలీసులు అతని వాహనానికి ఉన్న నకిలీ నంబర్ ప్లేట్‌ను గుర్తించి వాహనాన్ని, అతన్ని అదుపులోకి తీసుకొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహేందర్ యాదవ్

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### ఎఎంసి చైర్మన్ మహేందర్‌యాదవ్

**చిన్నకోడూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముందుకు సాగుతుందని ఎఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి ఆదేశాల మేరకు గంగాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో అనంతసాగర్, మల్లారం, కస్తూరిపల్లి, సికింద్లాపూర్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతులు గ్రామీణ ప్రాంతాల్లో దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకుని మద్దతు ధరను పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు హరీష్, పరుశరాములు, స్వామి, శాంతామధు సూదన్‌రెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ బుస్సా రాజశేఖర్, ఉప సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, గోవిందగిరి స్వామి, మహేందర్, ఎఎంసి డైరెక్టర్లు, సొసైటీ సీఈవో తదితరులు పాల్గొన్నారు.

### పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ ధ్యేయం

#### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ


ఇందిరమ్మ ఇల్లును ప్రారంభిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని గోనెపల్లిలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పేదల సొంత ఇంటి కల నెర వేర్చడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్, వైస్ చైర్మన్ బుస్సా రాజశేఖర్, పార్టీ నాయకులు, ఎఎంసి డైరెక్టర్లు బాలరాజు, సింగ బోయిన రాజు, బొమ్మల యాదగిరి, ఎర్ర మహేందర్, నరేష్, ప్రవీణ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఎపి డిప్యూటీ సిఎం త్వరగా కోలుకోవాలని పూజలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న జనసేన నాయకులు

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని జనసేన నాయకులు ఆకాంక్షించారు. సిద్ది పేట జిల్లా కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం జనసేన నాయకులు మురార్‌కార్ సాయికుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా సాయికుమార్ మాట్లాడుతూ ఏపీ డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ జరిగిన శస్త్రచికిత్స అనంతరం తర్వగా కోలుకొని ఆయురారోగ్యాలతో మళ్లీ ప్రజాసేవలోకి రావాలని కోరుకున్నారు. కార్యక్రమం లో జనసేన నాయకులు చుంచు నాగరాజు, అక్కు మల్లేశం, బండిపల్లి కృష్ణగౌడ్, మంకాల శ్రీకాంత్, బట్టు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### వేసవి సెలవుల్లో అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** గ్రామాల్లోని ప్రజలు వేసవి సెలవులు రావడంతో వారి పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో పిల్లలు ఈత కోసం కాలువలు, చెరువులు, బావుల వద్దకు వెళ్తుంటారని, ఈత రాకపోయినా ఈత కోసం వెళ్లి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. సెలవు ల్లో విహార యాత్రలకు వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.

**కాళేశ్వరం కెనాల్‌లోకి ప్రవేశం లేదు**

జగదేవ్‌పూర్ పరిధిలోని కాళేశ్వరం కెనాల్‌లో గత కొద్ది రోజుల క్రితం స్నానానికి దిగి ఇద్దరు వ్యక్తులు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి దుర్మరణం చెందారని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కెనాల్ వద్ద స్నానాలు చేయడం, కాలువలోకి ప్రవేశించడం నిషేదం అనే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఎవరు కూడా కెనాల్‌లోకి వెళ్లరాదని సూచించారు.

## గ్రామాల అభివృద్ధికే రోడ్డు సౌకర్యం

### డిసిసి అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి

**కొండపాక, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** రవాణా సౌకర్యాలుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని డిసిసి అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి అన్నారు. మంగళవారం కొండపాక మండలపరిధిలోని బందారం నుండి దర్గా గ్రామం వరకు 3 కిలో మీటర్ల బిటి రోడ్డు పనులను అమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ మంత్రి సీతక్క అనుమతితో రూ॥ 3 కోట్ల నిధులతో రోడ్డు పనులను ప్రారంభించడం జరిగిందని అమె తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ కొలుపుల గంగధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసరి లింగరావు. గంగుల వెంకటేష్, ఎఎంసి వెస్ చైర్మన్ బట్ట పర్శరాములు, తిమ్మారెడ్డిపల్లి సర్పంచ్ కొయ్యడ వెంకటేశం, నాయకులు బూర్గుల సురేందర్, అడ్వకేట్ రాజు, అంజయ్య, సుదర్శన్, మాదవరెడ్డి, దుర్గారెడ్డి, దుద్దెడ శ్రీకాంత్, ర్యాగల మహేష్, ఉప సర్పంచ్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


బందారంలో బిటిరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఆంక్షారెడ్డి

# 50 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి ఇవ్వాలి

### పిఆర్‌టియు రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్‌రెడ్డి



ఉద్యోగ విరమణ పొందిన సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**వర్గల్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** జూన్ 2వ తేదీలోపు 50 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి ఇవ్వ కుంటే ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమని పిఆర్ టియు రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి హెచ్చరించారు. వర్గల్ మండల శాఖ అధ్య క్షులు చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరి గిన మైలారం హెచ్ఎం సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఉద్యోగ విరమణ అభినందనసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సిఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని, మేనిఫెస్టోలో చేర్చిన ఈ సమస్యను జూన్ 2 లోపు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి ఉద్యోగు లకు ప్రభుత్వమిచ్చే బహుమతి కాదని, సానుభూతి తో ఇచ్చేది కాదని పేర్కొంటూ పెరుగుతున్న ధరల ప్రకారం పిఆర్‌సి పొందడం ఉద్యోగుల హక్కు అని తెలిపారు. ఆరునెలల్లో అన్ని సమస్యలను పరిష్కరి స్తామని చెప్పగా, ప్రస్తుతం ప్రభుత్వం వద్ద నిధులు లేవని ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే వారి ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సిఆర్‌టి మాజీ డైరెక్టర్ ఆనంద్ కిశోర్, జిల్లా అధ్యక్షులు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి శశిధరశర్మ, ఎంఈవో సునీత, హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షులు కరీమొద్దీన్, సంపాదక వర్గ సభ్యులు రామకృష్ణారెడ్డి, లక్కిరెడ్డి విజయ, మాజీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాచకొండ డిసిపి శ్రీనివాస్, రజిత, మండల శాఖ అధ్యక్షుడు చంద్రవేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్, కృష్ణ, సౌజన్య, సుభాష్, చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, తిరు పతిరెడ్డి, మల్లికార్జునస్వామి, శ్రీపాల్‌రెడ్డి, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



దాతకు శేష వస్త్రం, స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

### సత్ర నిర్మాణానికి రూ.15 లక్షల విరాళం అందజేత

**కొమురవెల్లి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయ సత్ర నిర్మాణానికి రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపాలిటీకి చెందిన వొంగురు సత్యనారాయణ, అనితయాదవ్ దంపతులు మంగళవారం రూ.15 లక్షల విరాళం అందజేశారు. స్వామి వారి దేవాలయ నిర్మాణంలో భాగంగా ఒక సత్రానికి రూ.15 లక్షల చెక్కును ఏఈవో బుద్ది శ్రీనివాస్, రావుల సుదర్శన్‌లకు అందించారు. అనం తరం ఆలయ అధికారులు విరాళం అందించిన భక్తునికి స్వామి వారి చిత్ర పటం, శేష వస్త్రం, ప్రసాదం అందజేసి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ముఖ్య అర్చకులు ఆంజనేయులు, మనోహర్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

### కోహెడలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంటు

**కోహెడ, ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** మండల కేంద్రంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంటును సర్పంచ్ బండెల సుజాత బాలకిషన్ మంగళవారం ప్రారంభించారు. మండల కేంద్రంలో కిమ్స్ సహజ విద్యాసంస్థల ఆధ్వర్యం లో వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాతబాలకిషన్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, టోర్నమెంటు నిర్వాహకులు, నాయకులు పొన్నాల లక్ష్మణ్, తిప్పారపు నాగరాజు, రాగుల రఘు, అవినాష్, వంశీ, మణిదీప్, దాసరి లింగమూర్తి, తలారి అనిల్, రాకేష్, వేల్పుల శరత్, తుపాకుల వెంకటేష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి అండగా పాలకవర్గం

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** భర్తను కోల్పోయి ఇద్దరు చిన్నారులను పోషించడానికి ఇబ్బంది పడుతున్న మహిళకు మండల పరిధి కామారం తండా పాలకవర్గం అండగా నిలిచింది. తండాకు చెందిన సంతోష, కుమార్‌లు భార్య భర్తలు. కుమార్ ఓ పరిశ్రమలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కుమార్ మృతి చెందగా ఆ నిరుపేద కుటుంబాన్ని ఆదుకునేందుకు పంచాయతీ పాలకవర్గం ముందుకు వచ్చింది. మంగళవారం బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచి మోహన్‌నాయక్, ఉప సర్పంచి విజయ, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, మోహన్, చందర్, సుభాష్, శాంతి, సోనియా, సుశీల, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు..బహుమతుల ప్రదానం..

**నర్సాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం నర్సాపూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలోమున్సిపల్ చైర్ పర్సన్ మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి ల ఆదేశాల మేరకు మున్సిపల్‌మేనేజర్ మధుసూదన్, హాస్టల్ వెల్ఫేర్ అధికారిణి గాయత్రి ఆధ్వర్యంలో నర్సాపూర్‌లోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహ లోని విద్యార్థినులకు మౌఖిక, నృత్య, వ్యాసరచన పోటీలతోపాటు ఇతర పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థినులు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థినులకు బహుమతులను మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, హాస్టల్ వెల్ఫేర్ అధికారిణి గాయత్రి ల చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మున్సిపల్ సిబ్బంది, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### బీఎస్పీ సీనియర్ నేత శాంత కుమార్ మృతి

#### పలువురు రాజకీయ నేతల సంతాపం

**నర్సాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** నర్సాపూర్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన బీఎస్పీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి శాంత కుమార్ సోమవారం రాత్రి మృతి చెందారు. శాంతకుమార్ మృతి చెందడం పట్ల పలు వురు రాజకీయ నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ బహుజన సమాజ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన స్వర్గీయ శాంతకుమార్ తుది శ్వాస వరకు ప్రజల కోసం పరితపించిన నాయకుడు. శాంతకుమార్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి శాంతకుమార్ పార్థివదేహాన్ని సందర్శించి సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో నాగులపల్లి గ్రామ సర్పంచ్ కోర్పోల్ సుమతి శివకుమార్, జిల్లా కార్యదర్శి రవీందర్, లింగం, మోహన్ దాస్, రమేష్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు


శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయానికి అందజేసిన నూతన రథం

### శ్రీలక్ష్మినరసింహస్వామికి నూతన రథం అందజేత

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే రథోత్సవ కార్యక్రమం కోసం అచ్యుత నారాయణ శ్రీ స్మృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో వేద పాఠశాల చైర్మన్ తిరుమల స్రవంతి రఘునాథచారిలు నూతన రథంను అందజేశారు. పూర్తిగా స్వచ్ఛమైన చెక్కతో, అద్భుతమైన నగిషీలతో ఈ రథాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి స్వామివారికి కానుకగా అందజేశారు. భక్తుల సౌకర్యార్థం, స్వామివారి వైభవాన్ని చాటిచెప్పేలా ఈ రథాన్ని రూపొందించినట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఈ రథం మంగళవారం రోజున స్వామివారి దేవస్థానానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రీ లక్ష్మినరసింహస్వామి వారికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఊరేగింపుకు స్వచ్ఛమైన చెక్కతో తయారు చేసిన రథాన్ని కానుకగా ఇచ్చిన వేద పాఠశాల చైర్మన్ తిరుమల స్రవంతి రఘునాథచారి, వారి కుటుంబానికి ఆ స్వామివారి దివ్య ఆశీస్సులు ఉండాలని, వారు సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

### కావేరి యూనివర్సిటీలో సంబరాలు



మాట్లాడుతున్న విసి ప్రవీణ్‌రావు

**వర్గల్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** కావేరి యూనివర్సిటీ అగ్రిటెక్ ఇన్నో వేషన్, పరిశోధన, విద్యాప్రతిభలో అగ్రస్థానాన్ని చాటుతూ ఇటీవలే వరుసగా మూడు ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్న సందర్భంగా మంగళవారం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సంబరాలు జరుపుకున్నారు. ఈ సంద ర్భంగా కేక్ కట్‌చేసి యూనివర్సిటీ ఐక్యత, విజయోత్సాహాన్ని ప్రతిబింబిం చారు. ఇందులో భాగంగా డాక్టర్ విశ్వప్రకాష్‌బాబు రచించిన పుస్తకాన్ని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వి.ప్రవీణ్‌రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గ్రంథం ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ రంగం లో విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు ముఖ్యమైన శాస్త్రీయ ఆధారం గా నిలుస్తుందని తెలిపారు. యూనివర్సిటీ సాధించిన ఈ విశిష్ట విజయాలకు అభినందనలు తెలియజేశారు. ఇటువంటి అవార్డులు, విద్యా కార్యక్రమాలు కావేరి యూనివర్సిటీని ఆవిష్కరణల కేంద్రంగా మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.శ్రీనివాసులు, డీన్‌లు డాక్టర్ ప్రతాప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ కొండ శ్రీనివాస్, డాక్టర్ సునీత మెహతా, ప్రొఫెసర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్య జయంతి వేడుకలను మంగళ వారం పట్టణంలోని సీతారామ ఉమామహేశ్వరాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, ఆదిశంకరాచార్య ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, మంగళహారతి మంత్రపుష్పం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అధ్యక్షుడు దేశపతి శంకర్‌శర్మ, కార్యదర్శి రవీందర్‌రావు, కోశాధికారి కృష్ణమూర్తిశర్మ, చాడ నందబాలశర్మ, ఉపాధ్యక్షుడు రాయారావు విశ్వేశ్వర్ రావు, బెజుగామ నాగేందర్‌రావు, దేవునూరి రాజేశ్వర్, యోగీశ్వర మురళి శర్మ, అమరవాది నిరంజన్‌శర్మ, ఆదిరాజుపల్లె శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.


ఆదిశంకరాచార్యకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

# హరీష్‌రావుపై బురదజల్లితే కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధిచెబుతారు


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రజా ఆశీర్వాద పేరిట బిఆర్ఎస్ ఆధిష్టానం నిర్వహించిన సభకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు, కెటిఆర్ హాజరు కాకపోతే కాంగ్రెస్ పార్టీ మంత్రులు, సోషల్ మీడియా బురదజల్లేలా ఇష్టానుసారంగా అడ్డగోలుగా హరీష్ రావుపై పోస్టులు పెట్టడం సిగ్గుచేటని ఆ పార్టీ నాయకులు కాముని శ్రీనివాస్, సోమిరెడ్డి, రమేష్, పాపయ్య, జంగిటి శ్రీనివాస్, బాబు, దేవయ్యలు మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాల యంలో వారు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలపైన, ఆరు గ్యారెంటీలపైన ప్రజలకు చెప్పలేక పరిపాలన చేతగాక వ్యక్తిగతంగా మాట్లాడ డం పార్టీలో అంతర్గత విషయాలు మాట్లాడడం కాంగ్రెస్‌కే చెల్లుతుందన్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ కాంగ్రెస్ సర్కార్ స్కాంలు, కమిషన్లను ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేక తప్పుడు కూతలు కూయడం సిగ్గుచేటని మండిపడ్డారు. హరీష్‌రావు కుండబద్దలు కొట్టినట్లు వందలసార్లు బిఆర్ఎస్ పార్టీ, కెసిఆర్‌పై తన వ్యక్తిత్వంపై ఎన్నోసార్లు చెప్పారని గుర్తు చేశారు. నా పుట్టుక బిఆర్ఎస్ నా చావు బిఆర్ఎస్ నా జీవితం ఉన్నంతకాలం కెసిఆర్ వెంబడే ఉంటా అని ఎన్నోసార్లు హరీష్‌రావు తెలి పినా కాంగ్రెస్ నాయకులకు బుద్ధి రావడం లేద న్నారు. కెసిఆర్ ఆదేశాల మేరకు హరీష్‌రావు ఢిల్లీకి వెళ్తే కాంగ్రెస్ నాయకులు కనీస ఇంకత జ్ఞానం లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాద న్నారు. హరీష్‌రావుపై అనవసరంగా బురదజల్లే ప్రయత్నం చేస్తే సమయం వచ్చినప్పుడు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

### ఆర్టీసీ కార్మికులు గేట్ ధర్నా

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఆర్టీసీ బస్సు డిపో ఎదుట కార్మికులు గేట్ ధర్నా చేపట్టారు. బుధవారం నుండి సమ్మెకు సిద్ధ మంటూ నినాదాలు చేశారు. 32 డిమాండ్లను పరిష్కరించాలని మేనేజ్‌మెంట్ కు సమ్మె నోటీస్ ఇచ్చి నెల రోజులు గడుస్తున్న ఇప్పటివరకు ఎలాంటి స్పం దన లేదని ఆర్టీసీ కార్మికులు ఆందోళన వ్యక్తంచేశారు. నేటి అర్ధరాత్రి నుండి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంతవరకు సమ్మెను కొనసాగి స్తామని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో ఆర్టీసీని ప్రభు త్వంలో విలీనం చేసి, పిఆర్సీ బకాయిలను విడుదల చేస్తామన్న ప్రభుత్వ హామీ ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని 30 నెలలుగా వేచి చూసామని, ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడంతో సమ్మెకు వెళ్తున్నామని తెలియజేశారు.

### నీటి సమస్య పరిష్కారానికి ఉపాధి హామీ పనులు

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** మండలంలోని పందిల్ల గ్రామంలోగల వడ్డెర కాలనీలో ఇళ్ల మధ్య వరద నీరు చేరి ప్రజలు ఇబ్బం దులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి సర్పంచ్ తోడేటి రమేష్ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఉపాధి హామీ పనుల ద్వారా కుమ్మరి కుంట కాలువలో ప్రవాహానికి అడ్డంగా పేరుకుపోయిన కలుపు మొక్కలను తొలగించే పనులు మంగళవారం చేపట్టారు. కాలువలో పేరుకుపోయిన మొక్కలు, చెత్త కారణంగా నీటి ప్రవాహం సరిగా సాగకపోవడంతో వరద నీరు కాలనీలోకి చేరుతుండగా, వాటిని తొలగించడం ద్వారా నీటి ప్రవాహం సులభంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ పనులు పూర్తయిన తర్వాత వడ్డెర కాలనీలో వరద నీటి సమస్య తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### ఉపాధి హామీ కూలీలకు రాగిజావ పంపిణీ

**అక్కన్నపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** మండలం గౌరవెల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు రాగిజావ అందించే కార్యక్రమాన్ని మంగళవారం సర్పంచ్ పొండ్రాల దాము మంగళవారం ప్రారంభించారు. మొదటిరోజు రాగిజావ ఖర్చులను మజ్జిగ ప్రదీప్ భరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాము మాట్లాడుతూ ఇకపై ఉపాధి హామీ పనులు ఎన్ని రోజులు కొనసాగినా ప్రతిరోజూ ఉదయం కూలీలకు రాగిజావ అందజేస్తానన్నారు. దానికి అయ్యే ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చారు. అదనంగా తాగునీటినీ అందిస్తు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాచర్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు మంద శ్రీనివాస్, గిరవేణి అనూష, బైరి శీను, రామస్వామి, పాములపర్తి రాజు, దండుగుల సురేష్, వేముల లత, మాచర్ల బాలవ్వ, జానకి సంపత్, టెక్నికల్ అసిస్టెంట్ ఉమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట స్వామి, గ్రామ కార్యదర్శి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా 'పోషణ పక్వాడ్' నిర్వహణ

**అక్కన్నపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండలం రామ వరం సెక్టర్ పరిధిలోని కపూర్‌నాయక్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ మనీకనుక నాయక్ హాజరై తల్లులు, చిన్నారులకు పోషకాహార లోపం లేకుండా చూసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. మిల్లెట్స్ ప్రాముఖ్యతపై అవగా హన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయడంతో పాటు, పిల్లల కోసం స్నాక్స్ వినియోగానికి బౌల్స్, స్పూన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ తేజస్విని(ఐవిసి), సూపర్‌వైజర్ సుజాత, గ్రామ కార్యదర్శి అశోక్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, తల్లులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### తొగుట జిల్లా పరిషత్ పాఠశాలకు ఆర్వోప్లాంటు విరాళం

**తొగుట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** తొగుట జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలకు గాడిపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ కాంగ్రెస్ నాయకులు గాడిపల్లి రఘువర్ధన్‌రెడ్డి మంగళవారం ఆర్వో ప్లాంట్‌ను విరాళంగా అందిం చారు. పాఠశాల విద్యార్థులకు శుద్ధి చేసిన తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో, హెచ్ఎం ఉపేందర్, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### రోబోటిక్ మోకాలి శస్త్ర చికిత్సలో వంద శాతం ఫలితాలు

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** రోబోటిక్ మోకాలి రీప్లేస్ మెంట్ సిస్టం మంచి ఫలితాలు ఇస్తుందని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి వైద్యులు డాక్టర్ విక్రమ్, ప్రతినిధి రాజిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మోకాలి రీప్లేస్‌మెంట్ చేసుకున్న పేషంట్లతో కలిసి వారు మాట్లాడారు. సిద్దిపేటకు చెందిన డాక్టర్ కుమార్, శకుంతల అనే పేషంట్లకు 45 రోజుల క్రితం మోకాలి రీప్లేస్మెంట్ ఆపరేషన్ రోబోటిక్ ద్వారా నిర్వహించామని వంద శాతం రీప్లేస్మెంట్ రిజల్ట్ సాధించామని తెలి పారు. రోబోటిక్ సిస్టం ద్వారా ఆపరేషన్ చేస్తే త్వరగా రికవరీ అవుతారని అలాగే రీప్లేస్మెంట్లో ఖచ్చితత్వం ఉంటుందన్నారు. రోబోటిక్ సిస్టం ద్వారా ఆపరేషన్ చేస్తే నొప్పి చాలా తక్కువ ఉంటుందని మొదటి రోజే నడవ గలుగుతారని తెలిపారు. సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ప్రజ్ఞాపూర్, గజ్వేల్ బస్టాండ్‌లను వెంటనే పూర్తిచేయాలి

#### -బిఆర్ఎస్ నేత మర్కంటి కనకయ్య

**గజ్వేల్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** ప్రజ్ఞాపూర్, గజ్వేల్ బస్టాండ్ల నిర్మాణా లను త్వరగా పూర్తి చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్కంటి కనకయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయినా కనీసం బస్టాండ్ల నిర్మాణం పూర్తి చేయడంలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మున్సిపల్ పరిధిలో మిషన్‌భగీరథ నీళ్లు సరిగా రావ డం లేదని, విద్యుత్ సరిగా ఉండడంలేదని విమర్శించారు. ఆర్టీసీ ఉద్యోగు లను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలన్నారు. కళ్యాణలక్ష్మి, షాది ముబా రక్ చెక్కులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మున్సి పాలిటీకి తగిన నిధులను ప్రభుత్వం మంజూరు చేయాలని అన్నారు.

### మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన రాములుగౌడ్

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సి పాలిటీ పరిధిలోని 15వ వార్డు సంగుపల్లికి చెందిన ఎర్రోళ్ల పోచవ్వ అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ మంగళవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు జోగిని లక్ష్మణ్, బాగమల్ల మల్లేశం, మన్నె కృపానందం, బక్కోళ్ల యాదగిరి, బడే సత్యనారాయణ, ముత్యాలు, బడే రవి, మన్నె బిక్షపతి తదితరులు ఉన్నారు.

### వెలికట్ట చౌరస్తాలో చలివేంద్రం ప్రారంభం

**కొండపాక, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఎంతో మంది ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని వెలికట్ట సర్పంచ్ బూర్గుల మానస సురేందర్ అన్నారు. మంగళ వారం వెలికట్ట క్రాస్‌రోడ్డు వద్ద చలి వేంద్రం ఏర్పాటు చేసిన అనంతరం అమె మాట్లాడుతూ ప్రభుత్వ అదేశాల మేరకు ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి చలి వేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రోజు ఈ చౌరస్తాలో వేలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి ఇక్కడి వస్తుపోతుంటారని తెలిపారు. అన్ని గ్రామాల్లో ప్రజల, ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవా లని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి నర్సింలు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వాసరి లింగరావు, ఉపసర్పంచ్ అమ్ముల పర్శ రాములు, వార్డుసభ్యులు ముత్యంరావు, అమ్ముల భాస్కర్, నాయకులు మం చాల కనకరాములు, కొమురవెల్లి రాజు, బూర్గుల నరేందర్ పాల్గొన్నారు.

### ఐఐటి జెఈఈ ప్రవేశ పరీక్షల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

**నర్సాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** నేషనల్ టెస్టింగ్ఏజెన్సీ నిర్వహిం చిన జాయింట్ ఎంట్రన్స్ పరీక్షల్లో(ఐఐటిజేఈఈ) 2026 మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో నర్సాపూర్ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారని ప్రిన్సిపల్ ఇ.బలరాం తెలిపారు. గిరిజన గురుకుల కళాశాలలోని విద్యార్థులు ఐఐటి జేఈఈ 2026 మెయిన్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించారని ఆయన చెప్పారు. ఈ మేరకు తమ కళాశాల నుండి 14 మంది విద్యార్థులు అర్హత పొందారని తెలిపారు . ఈ మేరకు తమ కళాశాలలో చదువుతున్న ఎం.ప్రవీణ్ 84. 17, కే రాహుల్ 77.51, ఏం రాకేష్ 74.05, ముఖ్య రజినీకాంత్ 73.22 ఈ పరీక్షలో మంచి ఫలితాలు సాధించారన్నారు. పేరుతో పాటు తమ కళాశాల నుండి 14 మంది ఈ పరీక్ష రాసి అర్హత పొందారని తెలిపారు. నర్సాపూర్ లోని గిరిజన గురుకుల కళాశాలలో మంచి ఫలితాలు సాధించడానికి సెక్రెటరీ సీతాలక్ష్మి, ఆర్‌సిఓ గంగారాం నాయక్ ల సహకారంతో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించారన్నారు. దీంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహం ఇతర అధికారుల సహకారం ఎంతో ఉందని పేర్కొంటూ వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.



డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న కాలనీ వాసులు

## రోడ్డు సమస్యను పరిష్కరించండి

**రామచంద్రాపురం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** తెల్లాపూర్ పరిధిలోని వనం, మేళ్ల చెరువుల్లోకి వచ్చే వరద నీరు సరైన కల్వర్టులు లేక రోడ్డుపైనే నిలిచిపోతుండంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మైహోమ్ అంకుర కాలనీ వాసులు మల్లేపల్లి బుచ్చిరెడ్డి, గోరుగంటి శ్రీధర్, రవి కోరుకొండ, నల్లపురెడ్డి గణేష్, వైఎస్‌కార్తీక్, శరత్, సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం పటాన్‌చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతిరెడ్డికి కాలనీవాసులు వినతిపత్రం అందచేశారు. అనంతరం కాలనీ వాసులు మాట్లాడుతూ గత వర్షాకాలంలో కాలనీ వాసులు ఎదుర్కొన్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. ఆర్ఆర్ సెవన్ రోడ్డు అధ్వానంగా మారడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధ్వానంగా మారిన రోడ్డుపై ఏర్పడిన గుంతను గత వర్షాకాలంలో కాలనీవాసుల వినతిమేరకు విపత్తు పునరుద్ధరణ నిధులతో పూడ్చేశారని, రాబోయే వర్షాకాలం లో తిరిగి సమస్యలు పునరావృతం అవుతాయని, అందుకు తాత్కాలిక పనులు కాకుండా శాశ్వత పనులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న లేయర్ పనులను పూర్తి చేయాలని సూచించారు.

## ఘనంగా ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే



అంగన్‌వాడీ సెంటర్ విద్యార్థులకు సర్టిఫికెట్ పంపిణీ చేస్తున్న కౌన్సిలర్లు

**గుమ్మడిదల, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** 'చిన్నారుల విద్య భవిష్యత్తుకు మొదటిమెట్టు మన అంగన్‌వాడీ' అనే నినాదంతో గుమ్మడిదల అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీచర్ సబిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య కొనసాగింది. 3 నుండి 5సంవత్సరాల వయస్సుగల చిన్నారులు ఆటపాటలతో అక్షరాభ్యాసం, క్రమశిక్షణను అలవాటు చేసుకున్న విద్యార్థులను ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రత్యేక దుస్తులు ధరించిన చిన్నారులు పాటలు, ఆటలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు అభిషేట్టి రాజశేఖర్, మద్ది సోసీశేఖర్‌రెడ్డి ఐదేళ్ల నిండిన పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల బాటలో తొలి అడుగు వేయబోతున్న చిన్నారులను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా సిద్ధం చేశామని టీచర్ సబిత తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని చిన్నారులను అభినందించారు

## హత్నూరలో చట్టాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

**హత్నూర, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి బి.సౌజన్య హత్నూర గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం న్యాయ అవగహనపై సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆమె మాట్లాడుతూ, పిల్లలకు చట్టాలపై అవగాహనా ఉండాలన్నారు. ముఖ్యంగా బాల్యవివాహంపై అవగాహన ఉండాలని చెప్పారు. పోక్సో యాక్ట్ కింద బాలలపై జరిగే లైంగిక నేరాలకు కఠినమైన శిక్షలు విధించడం జరుగుతుందని తెలిపారు. డొమెస్టిక్ వైలెన్స్ యాక్ట్ ద్వారా కుటుంబంలో మహిళలు ఎదుర్కొనే హింసకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని తెలిపారు. మహిళలు ఎలాంటి అన్యాయం జరిగినా భయపడకుండా చట్టపరమైన సహాయం పొందాలని సూచించారు. వృద్ధుల సంరక్షణ బాధ్యత పిల్లలదే అని అన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో హత్నూర పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి మదర్ అలీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సహజం



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సహజమని చీకోడ్, లింగయ్యపల్లి పిజిహెచ్ఎం విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఉపాధ్యాయుడు కొనింటి శ్రీనివాస్ పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, శ్రీనివాసరావు, పిఆర్టి నాయకులు పంతులు రాజు, సురేష్, మహేష్, అంజనాచారి, వెంకటేశం, కిషన్, మల్లయ్య, సతీష్ గౌడ్, పోచయ్య, ఆనందం, సిద్దయ్య ఉన్నారు,

## అంగన్‌వాడి కేంద్రాల్లో అన్నప్రాసన, అక్షరాభ్యాసం

**అల్లాదుర్గం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కాగితంపల్లి లో అంగన్‌వాడి కేంద్రాల్లో మంగళవారం పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడి సూపర్‌వైజర్ నాగమణి ఆధ్వర్యంలో చిన్నారులకు అన్న ప్రసాన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడుతూ చిరుధాన్యాలలోనే సంపూర్ణమైన ఆరోగ్యం ఇమిడి ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం తమ ఆదీనంలో ఉంచుకునేందుకు మంచి పోషకాలు కల్గిన అహారాన్ని స్వీకరించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయాలు, మునగ, బీట్‌రూట్ తదితరం పోషక విలువలు గల ఆహాన్ని తీసుకుంటే రక్తహీనత, రుగ్మతలు రాకుండా ఉంటుందన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేణుక, ఆసుపత్రి సూపర్‌వైజర్ సుదర్శన్, అంగన్‌వాడి టీచర్ లక్ష్మి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

# సమస్యల పరిష్కారానికి సహకరించండి : ఎమ్మెల్యే

**రామచంద్రాపురం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని బీహెచ్ ఈఎల్ భూములకు సంబంధించి నెలకొన్న వివాదాలపై త్వరగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విన్నవించారు. మంగళవారం బీహెచ్ఈఎల్ ఈడి శ్రీనివాస, ఏజిఎం సురన్‌ప్రసాద్‌తో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశమై సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ఈఎస్ఐ చర్చి సమీపంలోగల బీరప్ప ఆలయాన్ని బీహెచ్ఈఎల్ పరిశ్రమ భూమిలో ఉందంటూ సంబంధిత అధికారులు తొలగించడం సమంజసం కాదన్నారు. పరిశ్రమ ఏర్పాటు చేయకముందు నుంచి ఆలయం అక్కడే ఉందని గుర్తు చేశారు. అదే స్థలంలో ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టపోతే ప్రజల నుంచి నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల భావోద్వేగాలతో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. రామచంద్రాపురరం రాయ సముద్రం చెరువు సుందరీకరణ అంశంలో సైతం అధికారులు ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. చెరువు సుందరీకరణ పనులను అడ్డుకోవాలని హితువు పలికారు. ఈఎస్ఐ సమీపంలో గల క్రిస్టియన్ కమ్యూనిటీ శ్మశానవాటికలో బీహెచ్ఈఎల్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల వారి మృత దేహాలకు అంతక్రియలు చేసుకునేందుకు అనుమతిస్తూ ఇతరులను అడ్డుకుంటుంటున్నట్లు ప్రజలు ఆందోళన చెందుతున్నారని, అందరి అంతక్రియలకు అనుమతించాలని సూచించారు. హిందూ శ్మశానవాటికలో మౌలిక వతుల కల్పనకు అభ్యంతరాలు తెలపవద్దన్నారు. సమస్యలపై బుధవారం మరో మారు క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అధికారులకు వివరించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ పుష్పనగేష్, అంజయ్య, నాయకులు పరమేష్, ఐలేష్ పాల్గొన్నారు.



బీహెచ్ఈఎల్ అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్డీవో శ్రీనివాస్

## నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి : డిఆర్డీవో

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకంలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని డీఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండల పరిధి సూరారంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కూలీలకు ఎవైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. ఉపాధి హామి పనులకు అయ్యే కూలీలకు సకల సౌకర్యాలు కల్పించాలని డీఆర్డీవో శ్రీనివాస్ అధికారులకు సూచించారు. పని ప్రదేశాలలో త్రాగు నీటిని, విశ్రాంతి తిసుకోవడానికి గుడారాలను ఏర్పాటు చేయాలన్నారు. 40 మంది కూలీలు చెరువులో పూడికతీత పనులు చేపడుతున్నారని, ఎంత మంది కూలీలు పనులకు వచ్చినా కూడ తగిన సౌకర్యాలు చేయడానికి అధికారులు సిద్దంగా ఉండాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. నర్సరీలో 6వేలకు పైగా మొక్కలు నాటడానికి అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామంలో రెండు రోజుల్లో ధాన్యం స్వీకరణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆయన వెంట ఎంపీవో వినోద్, ఈసీ సంపత్ కుమార్, టీఏ గోపాల్, సర్పంచి సంతోష, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

## ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి

### ఆర్యవైశ్య సంఘం జిల్లా యూత్ ప్రెసిడెంట్ విట్టల్ గుప్తా



ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం జిల్లా యూత్ ప్రెసిడెంట్ విట్టల్ గుప్తా

**నర్సాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంఘం జిల్లా యూత్ ప్రెసిడెంట్ దుద్యాల విట్టల్ గుప్తా అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ధనవంతులనే అపోహ ఉందని, కానీ చాలామంది పేదరికంతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుచేసి, పేదరికంలో ఉన్న ఆర్యవైశ్యులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పేద ఆర్యవైశ్యుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిర్వర్తిస్తూ సంఘం అభివృద్ధికి పాటుపడతానని విట్టల్ గుప్తా పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

**నర్సాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** నర్సాపూర్ మున్సిపాలిటీకి మంజూరైన ఇందిరమ్మ మంజూరు పత్రాలను మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ మాచునూరి లక్ష్మీ మయాదవ్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజి రెడ్డి సమక్షంలో అందజేశారు. నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని పట్టణంలో సుమారు 70 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయి. ఈ మేరకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందరికీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంవదిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు అందరూ సద్వినియోగం చేసుకొని పక్కా ఇండ్లను నిర్మించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి సొంతింటి కల నెరవేస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సరళ ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, సాయికుమార్, ప్రవీణ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న మాచునూరి లక్ష్మీయాదవ్



గవ్వలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మాలతి

## కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి : తహసీల్దార్

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మాలతి తెలిపారు. మంగళవారం మండల పరిధి గవ్వలపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం కొనుగోళ్లు త్వరగా ప్రారంభించాలని నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట బాలక్రిష్ణ తదితరులున్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు : సర్పంచి



కామారంతండాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కామారం తండా సర్పంచి మోహన్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధి కామారం తండాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే మల్లుపల్లిలో సర్పంచి ఇమ్మడి నరేష్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

## పంటలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలి

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి



పంట పొలాలను పరిశీలిస్తున్న ఆవుల రాజిరెడ్డి తదితరులు

**నర్సాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** నర్సాపూర్‌లోని రాయరావు చెరువు కింద ఉన్న ఆయకట్టు పొలాలకు నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు మంగళవారం రాయరావు చెరువు కిందనున్న ఆయకట్టు పంట పొలాలను ఆయన పరిశీలించారు. పంట కాలువల పైనున్న కల్వర్టులు శిధిలమైనందున ఈ కల్వర్టుల నుండి పంట పొలాలకు నీరు అందడం లేదని పలువురు రైతులు రాజిరెడ్డి దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆవుల రాజిరెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరం ఉన్నచోట కల్వర్టులు నిర్మించాలని అధికారులను కోరారు. దీంతో అధికారులు కల్వర్టు పనులు త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు రాజిరెడ్డి తెలిపారు అనంతరం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 70 మందికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ మరాజ్‌యాదవ్‌తో కలిసి లబ్ధిదారులకు రాజి రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట కౌన్సిలర్ సరళ ఆంజనేయులు గౌడ్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం నాయకులు రిజ్వాన్ సాయికుమార్ వెంకట్రాంరెడ్డి ప్రవీణ్ రవికుమార్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండలపరిధిలోని జంగరాయి, కామారం తండాలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. కామారం తండాలో మల్లారెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా 100 మందికి పైగా తండా వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. జంగరాయిలో ఆక్సిజన్ లేజర్ కంటి దవఖానా ఆధ్వర్యంలో గ్రామస్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలను అందించారు. అవసరమైనవారికి కంటి ఆపరేషన్‌లు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు గోపాల్‌రెడ్డి, మోహన్‌నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మట్టిని ఇసుకగా మార్చి.. అక్రమ దందా..!

### చోద్యం చూస్తున్న అధికారులు

**చిలిపిచెడ్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మండలంలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇసుక అక్రమ ధనార్జననే లక్ష్యంగా రోజుకో కొత్తరకమైన అక్రమ దందా వెలుగులోకి వస్తోంది. గ్రామాల్లోని ప్రధాన చెరువు, కుంటలలోని మట్టినితవ్వుతూ ఇసుకగా మారుస్తూ నిత్యం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా అక్రమార్కులు ఇసుక దందాకు తెరలేపారు. చిలిపిచెడ్ మండల పరిధిలోని గన్య తండా గ్రామంలో ఓ అక్రమ దందాకు అలవాటు పడిన వ్యక్తి శివారులో గల చెరువు, కుంటలలో నుంచి మట్టిని రాత్రి వేళల్లో అక్రమంగా తరలించి ఓ చోట నిల్వ చేస్తున్నాడు. అక్కడి నుంచి పగలు రాత్రి అనే తేడా లేకుండా తనకు ఉన్న వ్యవసాయ బోరుబావి వద్ద మోటరు సాయంతో మట్టిని కడుగుతూ ఇసుకగా మారుస్తున్నాడు. రెవెన్యూ శాఖ అధికారుల కన్నుల్లో మట్టికొడుతూ.. అక్కడి నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఇతరులకు విక్రయిస్తూ అక్రమ దందాను కొనసాగిస్తున్నాడు. చిలపెడ్ మండలంలో కొనసాగుతున్న అక్రమ ఇసుక దందాను నీలిపివేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ సహదేవ్ వివరణ కోరగా విషయం మా దృష్టికి రాలేదని అన్నారు. వివరాలను తెలుకుని సదరు వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఇలా మట్టితో తయారైన ఇసుకతో ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన ప్రయోజనం ఉండదని నిర్మాణాల్లో నాణ్యత కోల్పోయి బీటు వారతాయని గృహనిర్మాణ దారులు ఇలాంటి నాణ్యత లేని ఇసుకుని కొనుగోలు చేయొద్దని ఆయన తెలిపారు.



అక్రమంగా ట్రాక్టర్‌లలో తరలిస్తున్న ఇసుక



మామిడి పంట సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సోమేశ్వరరావు

## సాగు పద్ధతులు పాటించండి.. అధిక దిగుబడులు అందుకోండి : సోమేశ్వరరావు

**జహీరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మామిడి పంట సాగులో పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సోమేశ్వరరావు మామిడి రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని హోతి(బి) గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు మామిడి పంటను సాగు చేస్తున్న రైతులకు అధిక దిగుబడులు సాధించేందకు పాటించాల్సిన యాజమాన్య పద్దతులపై సోమేశ్వరరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉద్యానవన శాఖ అందిస్తున్న సబ్సిడీలు, మామిడి తోటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫ్రూట్ కవర్ వినియోగం, హార్వెస్టింగ్ సమయంలో పాటించాల్సిన పద్దతులు, ఆదాయాన్ని పెంచుకునే మార్గాలపై రైతులకు వివరించారు. డ్రిప్ ఇరిగేషన్ ప్రాముఖ్యత, ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి పండరి, డివిజన్ వ్యవసాయ అదికారి బిక్షపత, హెచ్ఈఓ విఠల్, హోతి(బి) సర్పంచ్ మచ్చందర్, మాజీ ఆత్మ కమిటి చైర్మన్ విజయ్‌కుమార్, కేవికె శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ డాక్టర్ శైలజ, రైతులు మల్లేష్, అరవింద్ పాల్గొన్నారు.

## తమ్మూర్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

### -పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**మనూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తుమ్మూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం తోనే నేడు సామాన్యులకు సైతం సమాన హక్కులు, గౌరవం అందుతున్నాయని గుర్తుచేశారు. విద్యతోనే సమాజంలో మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణుసాగర్, డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శకుమార్, ఎస్ఐ కోటేశ్వరరావు, సర్పంచ్‌లు సంజీవ్, దత్తు బిరాదార్, మోహన్‌రెడ్డి, హన్మయ్య, భారత్, శ్రీశైలం, మాజీ సర్పంచ్, అంబేద్కర్ విగ్రహ దాత బ్రహ్మానందరెడ్డి, అంబేద్కర్ సంఘాల బాధ్యులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఆర్టీసీ కార్మికుల సమ్మె సన్నాక సమావేశం

**సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** సమ్మె సన్నాక సందర్భంగా సంగారెడ్డి డిపోలో మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్‌కు కార్మికులు హాజరయ్యారు. పీకే మూర్తి, ఇక్బాల్ పాషా, మహేందర్, గురు రాజు, భూపాల్‌రెడ్డి, వీరప్ప, వహీద్, గ్యారేజ్ సిబ్బంది, డ్రైవర్స్ కండక్టర్స్ పాల్గొన్నారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ రాష్ట వ్యాప్తంగా జరగబోయే సమెకు అన్ని వర్గాల ప్రజలు, ప్రజా సంఘాలు, అద్దె బస్సు యజమానులు, ఎన్జీఓ సంఘాలను సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరారు.

## మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడవద్దు : ఏవో

**చిలిపిచెడ్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడవద్దని ఏవో రాజశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం సోమక్కపేట గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ... రసాయన ఎరువుల అధిక వాడకం వల్ల నేల, నీటి కాలుష్యం పెరగడంతో పాటు, రైతులకు పెట్టుబడి ఖర్చు వృధా అవుతుందన్నారు. రైతులు దుక్కిలో వేసే బాస్వరం ఎరువుల్లో 30శాతం మొక్కకు అందుతుందని, మిగిలిన 70శాతం మొక్కలకు అందుబాటులో లేని రూపంలోకి మారిపోతుందని తెలిపారు. అధిక వినియోగం వల్ల నేల లవణ సాంద్రత పెరిగి, సూక్ష్మ పోషకాల లోపం ఏర్పడి, పంటల దిగుబడిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుం దని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సోమక్కపేట్ గ్రామ సర్పంచ్ బెస్త దురుగాచలం, ఏఈఓ అనిత, రైతులు శ్రీశైలం, కుమార్, అంజమ్మ పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు

**అల్లాదుర్గం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ఆయిల్ ఫామ్ సాగుతో అన్నదాత అధిక లాభాలు అందుకోవచ్చని లీఫ్ ఫామ్ రిసోర్సస్ కంపెనీ డైరెక్టర్ డాక్టర్ వైయస్ రంగనాయకులు అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం ఆయిల్‌ఫామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వైయస్ రంగనాయకులు మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంటను వరిలో అంతర్‌పంటగా సాగు చేసుకోవచ్చని రైతులు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం రైతులకు మొక్కలతో పాటు డ్రిప్పుకు 90 శాతం రాయితీ కల్పిస్తోందని, వరి కంటే ఆయిల్ ఫామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఉద్యానవన శాఖ ద్వార రైతులకు మొక్కలపై 11,001 రూపాయల రాయితీతో పాటు 4 సంవత్సరాలు తోట నిర్వాహణ, అంతర పంటల సాగు కొరకు 4200 రూపాయల చొప్పున 4 సంవత్సరాల వరకు 16,800 రూపాయలను రైతుల బ్యాంక్ కాతాల్లో జమచేస్తామన్నారు. ఒక రైతుకు గరిష్టంగా 12.50 ఎకరాల వరకు డ్రిప్పు పరికరాలపై రైతు సదుపాయం అందుకోవచ్చన్నారు. సంవత్సరానికి రైతు 1 లక్ష రూపాయలను ఎకరానికి లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాజేష్, ఏఈఓ నవీన్, లీఫ్ ఫామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్, సర్పంచ్ నరసింహారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నజీర్, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి : ఎంఇవో

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** విద్యార్థులు పోటీ ప్రపంచంలో అన్నిరంగాల్లో రాణించి, ఉన్నతస్థాయికి ఎదగాలని మండల విద్యాధికారి దీప్లా రాథోడ్ తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో 5వ తరగతి విద్యార్థులకు గణితం, పరిసరాల పరిజ్ఞానంపై పోటీ పరీక్షలను నిర్వహించారు. పోటీ పరీక్షలను ప్రతి నెల నిర్వహిస్తామని తెలిపారు. చిన్నశంకరంపేట ప్రాథమికోన్నత పాఠశాలకు మొదటి స్థానం, మల్లుపల్లి ప్రాథమిక పాఠశాలకు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించారు. కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలంటూ

## సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా

**జహీరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులను వెంటనే జమచేయాలని డిమాండ్‌చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించి మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మహిపాల్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లిస్తాం అంటూ అధికారులు కాలయాపన చేయడం తగదన్నారు. అధికారులు స్పందించకుంటే పెద్దఎత్తున ఆందోళనకు దిగాల్సి వస్తుందన్నారు. కార్మికులకు సబ్బులు, నూనెలు, యూనిఫామ్ షూస్ తదితరర సౌకర్యాలు కల్పించాలని వినతి చేశారు. ఎండలు మండుతున్నందున ఒక పూట మాత్రమే విధులు నిర్వహించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మహేశ్వర్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సంజీవ్, యశోదమ్మ, విఠల్, లక్ష్మి, పుణెమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందచేస్తున్న కార్మికులు